


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

నవంబరు 2018

సంపుటి : 24 **287** సంచిక : 11




## విమర్శించింది తక్కువ! విభేదించింది తక్కువ! విరోధించింది తక్కువ!


### -84 సంవత్సరాల నా జీవితంలో ఎన్నెన్నో విచారకర ఆటుపోట్లకు ఎరయ్యాను!-

### -అన్నిటినీ తడబడుతూ తట్టుకుంటూ వచ్చాను-

పదేళ్లవయసులో అనగా 1942 వరకూ నా జీవితం ఎంతో గారాబంగా గడిచింది. అప్పట్లో వచ్చిన గాలివానకు మా యింటి పైకప్పు కూలిపోయింది. నాకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. మా అమ్మ బాధలు పడుతూ, రాత్రి తెల్లవార్లూ ఎత్తుకుని తిప్పుతూనే ఉంది. నా జ్వరం తగ్గుముఖం పట్టింది. అంతవరకూ జ్వరం అంటే ఎరుగని మా అమ్మకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. గాలివాన ఊరికే పోకుండా మా అమ్మ ప్రాణాల్నూ అనంత విశ్వంలోని గాలిలో కలిసేటట్టు చేసింది. ప్రాణాలు పోవడానికి రెండు రోజుల క్రితమే మా అమ్మ తన పుట్టిల్లు కస్తూరివారి సావరం నుంచీ వస్తూ మా మేనమామతో రామాలయం సమీపించే సరికి తమ్ముడు కట్టెల బండి ఎదురొచ్చిందిరా! ఇక నేను పుట్టింటికి రానేమోరా అన్నది. తథాస్తు దేవతలు విన్నారేమో తథాస్తు అన్నారు. అమ్మ తన ప్రాణాల్ను విడుస్తూ నాకూ, మా మేనమామ భార్య (మేనత్త)కు ప్రాణదానం చేసింది. అలా నా జీవితం 22 సంవత్సరాల వరకూ ఒడిదుడుకులతో సాగింది. జర్నలిజంపై గల ఉత్సుకతతో చదువుపై శ్రద్ధ సన్నగిల్లింది. ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేసి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసాను. జిల్లా విద్యాశాఖాధి కారుల ప్రశంసలు పొందాను. ఉత్తమ ఉపాధ్యాయుడనిపించు కున్నాను. అయినా పత్రికా రచనపై గల మక్కువ ముందు ఉత్తమ ఉపాధ్యాయుడు అన్న కీర్తి సంతృప్తిపరచలేదు. ఏదో చేయవలసిన పని నాపైన ఉన్నది సాధించవలసిన భవిష్యచ్చరిత్ర ఉన్నది అందుకో విశాలమైన సాహితీకాణాచిని వెతుక్కోవాలని తీవ్రఅన్వేషణ చేసాను.

అందుకు మూసీనదీతీరం మద్రాసు సరియైనదనే నిర్ణయానికి వచ్చి, 1954 సంవత్సరంలో మూటా ముల్లె సర్దుకుని వచ్చాను. కానీ కాలం అనుకూలించలేదు. తిరిగి పాలకొల్లు వెళ్ళిపోయాను. మరల పట్టువీడని విక్రమార్కునిలా 1956లో మద్రాసు వచ్చాను.

మద్రాసు తెలుగువారల సాహితీ కాణాచి. ఎందరో తెలుగువారికి మార్గనిర్దేశనం చేసింది. రచయితలు, కవులు, కళాకారులు, వివిధ రంగాలవారికి మద్రాసు తన ఒడిలో చేర్చుకున్నది. సెంట్రల్ స్టేషన్ ప్రక్కన ఉన్న మోర్ మార్కెట్ బోలుదు గ్రంథాల రాకెట్టు. ఆ ప్రక్కనున్న ఎర్రగాబుర్రగా ఉన్న విక్టోరియా పబ్లిక్ హాలులో ఉన్న చెన్నపురి ఆంధ్ర మహాసభ, కళలకు కళాకారులకు నెలవుగా ఉండేది. ఆ భవనం తెలుగు ప్రభువులదే అయినా, ఆంధ్రమహాసభ వెనకకు నెట్టబడింది. వదాన్యులతో ప్రకాశం భవన్‌పేరిట వెలిసింది. నాటకాలూ, సాహితీ సభల నెలవుగా తీర్చిదిద్దబడింది. అక్కడే నాకు ఘనసన్మానమూ, స్వర్ణపతక ప్రధాన గౌరవమూ జరిగింది. టి.జి.కమలాదేవి, తరువాత హెచ్.ఎం.వి. మంగపతి ప్రాణపదంగా చూచుకున్నారు. తరువాత అమావాస్య చీకట్లు ఆవరించి అదీ అదృశ్యమై పోయింది. ఇప్పుడేమైనా కార్యక్రమాలు జరగాలంటే పొట్టి శ్రీరాములు మెమోరియల్ మిషన్ భవనమూ, విజయరాఘవా చారి రోడ్డులో ఆంధ్రా క్లబ్‌లే! ఇవే తెలుగువారి చిరునామాను కాపాడుతున్నాయ్. ఈ చిరునామాను చెరగిపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత తెలుగువారికున్నదని తెలుగు జనత గ్రహించాలి.




బుధజన విధేయుడు

- గోటేటి శ్రీరామారావు


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మాహుతి చేసుకుంటేనేగాని ఆంధ్రరాష్ట్రం సిద్ధించలేదు!



ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలనీ, ఒకే భాషా, ఒకే సంస్కృతీ, ఒకే సాంప్రదాయం గల జాతి, సామాజిక చైతన్యంతో, సామాజిక పునర్వికాసం చెందడానికి స్వయం పరిపాలనా రాష్ట్రాలు ఏర్పడి, మాతృభాషలో పాలనం సాగాలన్న భావం నూటా పదమూడేళ్ల క్రితం జనించింది. భారత స్వాతంత్ర్యోద్యమంతో బాటు ఆంధ్రుల భాషా రాష్ట్రోద్యమం అత్యంత ఆవశ్యకమైనదనెడి భావం ప్రగాఢంగా అంకురించింది. స్వయం భాషా రాష్ట్ర వాంఛకు మార్గదర్శకమైనదీ, ప్రథమంగా రాష్ట్రోద్యమాన్ని చేపట్టినది కూడా ఆంధ్రులే! బెంగాల్‌లో బిపిన్ చంద్రపాల్‌కు మద్దత్తుగా, ఆయన అరెస్టుకు నిరసనగా ఉద్యమం జరిపింది కూడా ఆంధ్రులే! తెల్లదొరల పాలన పోవాలని ఆనాడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 'స్వరాజ్య' పత్రికలో వ్యాసం వ్రాసి, రాజద్రోహ నేరం క్రింద అరెస్టు కాబడ్డారు. బొంబాయి నుండి వెలువడిన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారి 'ఆంధ్రపత్రిక' మాతృభాషా భావాల్ని వ్యాప్తి చేయనారంభించింది. ఆంధ్ర భాషా వికాసానికి కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులు, కొమర్రాజు లక్ష్మణరావు కాంతులను విరబూయించారు. ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చే రచనలు చేసి, మాతృభాషపై మక్కువ పెంపు చేశారు. ఈనాటి వలెగాక ఆనాడు సభలూ, సమావేశాల్లో తెలుగువాడకం పెరిగింది. 1908లో మచిలీపట్నంలో జరిగిన ఆంధ్ర సభలకు నిజాం సంస్థానంలోని తెలుగువారు విచ్చేసి, సభను రంజింపచేస్తూ, ఆంధ్రజాతి సమైక్యతకు నాందీ వాక్యం పలికారు. ఆనాడు అందరూ ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుందనెడి కలలు కన్నారు. బ్రిటీష్ రాజ్య ప్రతినిదిగా వచ్చిన లార్డ్ హార్డింగ్ బీహారువాళ్లను చీల్చి 1911 సంIIములో బెంగాల్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంతో, ఆంధ్రరాష్ట్ర నిర్మాణం కూడా అవశ్యం జరగాలనెడి నిర్ణయానికి యువతరం వచ్చింది. గుంటూరులో ఏర్పడిన చల్లా గురునాధం ప్రభృతులు విశాలాంధ్ర చిత్రపటానికి 1911లో రూపకల్పన చేశారు. 1913లో బాపట్లలో ఆంధ్రమహాసభ ప్రథమ సమావేశం ఏర్పాటు చేసి, భాషా ప్రాతిపదికపై భారతదేశాన్ని పాలనా సౌలభ్యం కోసం విభజించాలని తీర్మానిస్తూ, అప్పటి భారత జాతీయ కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేసింది. ఆంధ్రకు ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెస్‌ను ఏర్పాటు చేయమని 1917 సంIIము కలకత్తా కాంగ్రెస్ మహాసభలో కోరడం కూడా జరిగింది. దీనిని అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు అనిబిసెంట్, గాంధీగారలు వ్యతిరేకించడం, లోకమాన్య తిలక్ వారితో విభేధించడంతో తీర్మానం నెగ్గింది. ఈ సమయంలోనే భారతదేశం వచ్చిన మాంటేగు-చేమ్స్‌ఫర్డులు వద్దకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని కోరుతూ కొందరు ప్రముఖులు వెళ్లడం, భాషా రాష్ట్ర కోరిక సమంజసమైనదేనని ఆంగ్లేయులు అంగీకరించడంతో ఆంధ్రరాష్ట్రావతరణం ఖాయమనుకున్నారు. భారత కాంగ్రెస్ కూడా భాషా ప్రాతిపదికపైననే శాఖలుగా నెలకొన్నది. ఏంవి ప్రయోజనం? బ్రిటిష్‌వారి మాటలు నీటిమూటలయ్యాయి. 1928లో లక్నోలో జరిగిన అఖిల పక్ష సమావేశం వెంటనే ఆంధ్రరాష్ట్రం ఏర్పాడాలన్నది; నెహ్రూ నివేదిక కూడా అంగీకారం తెలిపింది. రాజ్యాంగ సంస్కరణల విచారణకు వచ్చిన సైమన్ కమిషన్, దానిపై ప్రతిఘటనోద్య

## అమరజీవి పొట్టి శ్రీరాములు గారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం!

**తెలుగు తేజము దీప్తి చెందగ**
**తెలుగు వెలుగులు దిశల నిండగ**
**తెలుగు తల్లిని గొలువ దీక్షతో**
**తరలిరావోయ్ అమరజీవి!**
**తెలుగు సీమకూ**
**తెలుగు జాతికీ**
**అమరజీవికి**
**మా పుష్పాంజలులు**

పుట్టిన ప్రతి మానవుడూ గిట్టక మానడు. కాని మానవుడు భ్రమకు లోనుకాకుండా సత్యానికీ సేవకూ లోను కావడంలోనే మహాత్ముడనిపించుకుంటాడు. ఆధునిక ప్రపంచంలో ఇలాటి మహనీయులైన మానవులు అరుదుగా కనిపిస్తారు. దృశ్యాదృశ్యంగా ఉన్నప్పటికినీ వారు త్యాగాలను చేయలేరు. ఘన కీర్తులనందుకోనూ లేరు. షట్మహాభాగ్య శీలురైతేనేగాని వారికి పూర్ణ పురుషత్వం కలుగదు. సర్వ సౌందర్యం, సర్వ సంపత్తి, సర్వశక్తి, సర్వకీర్తి, సర్వజ్ఞానం, సర్వత్యాగం అనేవీ షట్మహాభాగ్యాలు. ఇవి సాధారణంగా అలవడేవి కావు. ప్రపంచ ప్రఖ్యాతగొన్న నాయకులు సహితము కొంతకాలమే వారి జీవితం కాలం జీవించ కలుగుతున్నారు. మరికొందరు మరణానంతరం కొంతకాలమే జనం మదిలో మెదలకలుగుతున్నారు కానీ, ఎల్లకాలమూ, ఎల్లలు దాటి ప్రజల హృదయాల్లో 'అమరజీవి'లా కొలువై వెలసినవారు అరుదు. అలాటి అరుదైన వారిలో 'అమరజీవి'గా ఖ్యాతిగొన్న పొట్టి శ్రీరాములు ఒక్కరే!

**జీవాత్మనః ప్రశాన్తస్య పరమాత్మా సమాహితః** మనస్సును జయించినవాడు శాంతినీ పొందుతాడు. పరమాత్మనూ చేరుకుంటాడన్నారు భగవద్గీతలో. ఆనాడు మద్రాసులో పొట్టి శ్రీరాములుగారు చెన్నపట్టణంతో కూడిన ఆంధ్రరాష్ట్రం కోసం తన యాబదివ ఏట, యాభై ఆరు రోజులు కఠిన నిరాహార దీక్షను సత్యదృష్టితో చేసి, తాను నమ్మిన సత్యానికి బలి అయ్యారు. ఆయన జీవించినది యాభై ఏళ్ళు మాత్రమే అయినప్పటికినీ మరణించి ఇంతకాలం అనంతరం కూడా వారు మనందరి స్మృతి పథాల్లోనూ జీవిస్తూన్న ఆ మహాపురుషునికి **త్యాగమయుడవహో, ధన్యజీవివహో** అంటూ 'ప్రముఖాంధ్ర' జోహారులర్పిస్తోంది.



మం, అటు తరువాత మద్రాసులోని మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రవిభజనను అడ్డుకోవడంతో కథ మరల అడ్డం తిరిగింది. కుటిల నీతిగల బ్రిటీషువారు ఒరిస్సా, సింధు రాష్ట్రాల నేర్పరచడానికి సంసిద్ధతను చూపి, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు కుంటిచెయ్యి చూపించారు.

అధికారంలోకి వస్తే భాషారాష్ట్రాలనేర్పాటు చేస్తామని 1936 సం॥ము ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెసు వాగ్దానం చేసింది. తదనుకూలగా 1937 అక్టోబర్ 25 నెహ్రూ అధ్యక్షతన జరిగిన కలకత్తా సమావేశం ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది, ఇతర భాషా ప్రాదికార రాష్ట్రాలను కూడా ఆమోదించింది. ఆంధ్ర, తమిళ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని మద్రాసు శాసనసభలో తీర్మానాన్ని ప్రతిపాదించింది. తెలుగువారు సంబరపడి పోయారు. కానీ చక్రవర్తుల రాజగోపాలాచారి 'రహస్య సమాచారం' పంపడంతో ఆంధ్రరాష్ట్ర విభజనకు ప్రతిబంధకం ఏర్పడింది. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మద్రాసులో ఏర్పరచాలనెడి ప్రతిపాదనకు కూడా ప్రతిబంధకం ఏర్పడడంతో, విశ్వవిద్యాలయాన్ని విశాఖపట్టణానికి తరలించారు. ఇందుకు అలకవహించిన రాయలసీమవారు తమ కళాశాలలన్నిటినీ మద్రాసు విశ్వవిద్యాలయానికే అనుబంధ పరిచారు. సర్కారు కోస్తా జిల్లాలపై రాయలసీమవారికి అనుమానాలు పెరగడం, అపోహలు కల్గడంతో– ఇరువర్గాలనాయకులు మద్రాసు మైలాపూరులోని దేశోద్ధారక శ్రీకాశీనాథుని నాగేశ్వర రావు పంతులుగారి శ్రీబాగ్ భవనంలో కలిసి 'శ్రీబాగ్ ఒడంబడిక' నేర్పరచుకోవడంతో సమస్య పరిష్కృతం అయింది కానీ, 1938 సం॥ములో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలన్న తమ పాత తీర్మానాన్ని మార్చుకున్నది. అటు తరువాత 1947 ఏప్రిల్ 18న మద్రాసు శాసనసభలో దక్షిణ భారత రాష్ట్రాలను భాషాప్రాతిపదికపై విభజించాలని భావించినప్పటికినీ, భాషా రాష్ట్రాల ఏర్పాటు చేస్తే దేశం చిన్నాభిన్నమవుతుందంటూ కాంగ్రెసు నాయకులు తిరస్కరించారు. మరల ప్రజా ఒత్తిడిని తట్టుకోలేక భాషా రాష్ట్ర విభజనకు 'థార్ కమీషన్'ను నియమించినపుడు, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు 'మద్రాసు మాకే రావాలి' అంటూ పట్టుబట్టారు. విభజన అనర్థకమైన వ్యవహార మంటూ రాయలసీమ మహాసభ అధ్యక్షుడు నీలం సంజీవరెడ్డి ప్రతిబంధకంగా నిలవడంతో 'థార్ కమీషన్' దేశాన్ని భాషా ప్రయుక్తంగా విభజించరాదని సిఫార్సు చేసింది. కొందరు కాంగ్రెస్‌వారు థార్ రిపోర్టును తీవ్రంగా విమర్శించారు. నెహ్రూ, పట్టాభి, పటేల్ గార్లతో కూడిన సంఘం దేశాన్ని భాషా ప్రయుక్తంగా విభజించరాదని తీర్మానించింది. మరికొంత కాలానికి ఆంధ్రరాష్ట్ర విభజనను అంగీకరిస్తూ, మద్రాసు కోసం పట్టుబట్టవద్దని హితవు చేసింది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘం 1949 నవంబర్ 11న యీ హితవును అంగీకరిస్తూ కొంతకాలంపాటు మద్రాసులో ఆంధ్ర రాజధానిని పెట్టుకోనివ్వాలని కోరింది. నిర్వివాద ప్రాంతాలైన 11 జిల్లాలు, 3 తాలూకాలతో రాష్ట్రం ఏర్పరచుకోవచ్చుననెడి సిఫార్సు కొందరికి నచ్చలేదు. మద్రాసుపై ప్రకాశంగారి పట్టును కొంతమంది తెలుగు, తమిళ కాంగ్రెస్ నాయకులకు యిష్టం గాకపోవడంతో రాష్ట్ర విభజనకు అంతరాయం కల్గింది. హైదరాబాద్‌లో శ్రీయుతులు మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి ప్రభృతులు ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. నైజాములో రజాకార్ ఉద్యమం ప్రారంభమైంది. రాష్ట్రం నా జేబులో లేదంటూ నెహ్రూ హేళన చేసినట్లు మాట్లాడారు. అన్ని చోట్లా ఉద్యమాలతో గందరగోళాలూ ప్రారంభమయ్యాయి. గాంధేయుడూ, సత్యవాది, అహింసామూర్తియైన పొట్టి శ్రీరాములు హృదయం కుతకుతలాడిపోయింది. వేఱుమార్గం లేదని ఆయన కఠిన నిరాహారదీక్ష కుపక్రమించారు. దీక్ష 50 రోజులకు చేరుకున్నప్పటికినీ, కాంగ్రెస్‌లోకానీ, కేంద్రంలోకానీ చీమ కుట్టినట్టనిపించలేదు. 1952 సం" అక్టోబరు 19న శ్రీ పొట్టిశ్రీరాములు ప్రారంభించిన నిరాహార దీక్ష 1952 డిసెంబర్ 15వ తేదీ అర్ధరాత్రి ఆయన అసువులు అనంత విశ్వంలో కలిసిపోయాయి. పొట్టిశ్రీరాములు ఆత్మాహుతితో ఆంధ్రదేశం అట్టుడుకిపోయింది. 12 మంది ప్రాణాలు కోల్పోయారు. కేంద్రం, కాంగ్రెస్, యితర పార్టీలు కలిసికట్టుగా ఉద్యమించాయి. ప్రకాశం గారి కోరిక ప్రకారం చెన్నయ్ సిద్ధించనప్పటికినీ కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడటం, అనంతరం 1956 సం॥ము నవంబర్ 1న సంపూర్ణ ఆంధ్రప్రదేశ్ అవతరించడం జరిగింది. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మాహుతితోగానీ ఆంధ్రప్రదేశ్ సిద్ధించలేదు. ●









# ఫలితం ఆశించిన దానం!

**ధనము కూడబెట్టి దానంబు చేయక – తాను దినక లెస్స దాచుగాక**
**తేనెటీగ గూర్చి తెఱుపరికియ్యదా – విశ్వదాభిరామ వినురవేమ**

–అన్నాడు వేమన మహాశయుడు. దానమూ ధర్మమూ చేయక కూడబెట్టిన బ్రతుకు తేనెటీగ వంటిది – అన్నాడా మహాశయుడు. మానవజీవితంలో దానం యివ్వడం, దానం పొందడం అనేది సహజం. తేనెటీగ వలె కూడబెట్టి, కూడబెట్టి, తాను తన సంపదతో హరింపబడటం ఏమి సబబు? అనాదిగాభారతదేశంలో దానధర్మములు జనుల రక్తనాళాల్లో ప్రవహిస్తూన్నవే! మొన్నటి కార్గిల్ యుద్ధ సమయంలో పత్రికలవాళ్ళూ, రాష్ట్ర ప్రభుత్వాలూ నిధిసేకరణ చేసి, మన సైనికుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నిధికి ధనం పంపారని మీకు నేను కొత్తగా చెప్పవలసిన పనిలేదు. అందరూ వారి వారి స్థోమతకు తగినట్టు, దాన ధర్మములు చేయాలి, దానమిచ్చిన దాత తన దాతృత్వాన్ని చెప్పుకోకూడదు. దానం గ్రహించిన వాడే చెప్పుకోవాలి. అందుకు కుడిచేత్తో యిచ్చినది ఎడమచేతికి కూడా తెలియనివ్వరాదని పెద్దలన్న మాటల్లోని సత్యమిదే!

పూర్వకాలంలో రాజులు యాగంచేసి యాగఫలితాన్ని పొందేవారు. కురుక్షేత్ర సంగ్రామం ముగిసిన తరువాత పాండవులు అయిదుగురూ ఓ పెద్ద యాగం చేసి, పేదలందరికీ దానాలు చేశారు. అంతటి పెద్ద యాగాన్ని ఎవరూ చేసి ఉండరని అందరూ చెప్పుకునేవారు. కానీ యాగం ముగిసిన అనంతరం ఎక్కడనుంచో ఒక



ముంగిస వచ్చింది. దాని శరీరంలోని ఒక భాగం మేలిమి బంగారు ఛాయలోనూ, మిగతా భాగం బూడిద రంగులోనూ ఉన్నది. వచ్చీ రావడంతోనే యాగమండప మంతా తిరుగుతూ తిరుగుతూ దొర్లాడింది. అటు తరువాత వచ్చి – మీరు దానపరులే కాదు. ఇదొక యాగమే కాదు అటూ అక్కడున్న వాళ్లను ఈసడించింది. వాళ్ళు ఆశ్చర్యంతో ఏమిటలా అంటున్నావ్. ఇక్కడ మహా గొప్పగా యాగం జరగడమే గాకుండా, బీదాసాదలకు బంగారు నగలనూ, నాణెములనూ దానంగా యివ్వడం జరిగింది. ఇంతటి మహోత్తమ, మహోన్నత యాగాన్ని అబద్ధపు యాగం అంటావా అంటూ హుంకరించినట్లు ప్రశ్నించారు.

దానికి ముంగిస సమాధానం చెబుతూ ఇంత క్రితమే నేనొక గ్రామాన్నుంచి వస్తూన్నాను. ఆ గ్రామంలోని ఒక బ్రాహ్మణుడు తన భార్య, కొడుకు, కోడలుతో ఉంటున్నాడు. వారిది అతి పేద కుటుంబం. గ్రామంలో పాఠాలు చెప్పుకొని కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. రెండు పూట్లా పూర్తిగా భుజించిన రోజులు అతి కొద్దివేనని చెప్పాలి. అలాంటి సమయంలోనే పరీక్షాకాలంగా కరువు వచ్చింది. గంజి నీళ్ళకు కూడా కరువు ఏర్పడింది. ఇలాంటి సమయంలో ఓ రోజు అదృష్టం కొద్దీ కొంచెం బార్లీ పిండి దొరకడంతో, సంబరపడి గంజిగా కాచుకుని నలుగురూ త్రాగుదామని తలుపులు వేసుకుని కంచాల వద్ద కూర్చున్నారు. ఇంతలోనే తలుపుకొట్టిన శబ్దమైంది. తీరా తలుపు తీసేసరికి ఆకలిలో ఉన్న అతిథి కనపడ్డాడు. ఆయన్ను సాదరంగా లోపలికి ఆహ్వానించి, బ్రాహ్మణుడు తన భాగం గంజినిచ్చాడు. అతడు ఆవురు ఆవురుమని త్రాగుతూ, అయ్యా నేను పది రోజులుగా ఏ తిండీ లేకుండా ఆకలితో అలమటించి పోతున్నాను. మరి కొంచం జావ నిచ్చి ప్రాణం కాపాడండి అన్న వెంటనే బ్రాహ్మణుని భార్య తన వంతు జావను యిచ్చింది. అది కూడా అతనికి చాలినట్లు కనిపించకపోగా అతని కుమారుడు తన వంతు జావనిచ్చాడు. అదీ అతని ఆకలి తీర్చకపోయేసరికి కోడలు తన వంతు జావను కూడా అతనికి యిచ్చింది. తన ఆకలి తీరిందని తృప్తిగా తేనుస్తూ, ఆ అతిథి వాళ్లను దీవించి వెళిపోయాడు. ఆకలి బాధను తట్టుకోలేని బ్రాహ్మణ కుటుంబ సభ్యులు నలుగురూ ఆ రాత్రే మరణించారు. అక్కడ నేలమీద వారి పాత్రల నుంచి వలికిన జావ నా వంటికి తగిలి, ఆ వైపు శరీరమంతా బంగారమయింది. కానీ మీ యాగశాలలో పడి నేను క్రింద దొర్లినపుడు నా శరీరం మేలు బంగారంలా మారి ఉండాలి. అలా మారలేదు సరికదా, బూడిద రంగులోనే ఉన్నది. కాబట్టే మీరు చేసిన యాగం గొప్పదేమీ కాదంటున్నాను అంది ముంగిస.

ధర్మం చేసేవారెవరూ, దానం తీసుకునేదెవరు, ఎట్టి పరిస్థితుల్లో ఎలాంటి దానం చేశారన్నదే ప్రధానం. అందరూ చిత్తశుద్ధితో దానం చేయాలని ధర్మశాస్త్రం చెబుతున్నది. క్రిమికీటకాల్లో కూడా ధర్మబుద్ధి ఉన్నదన్న విషయం ఈ కథ ద్వారా విశదమవుతున్నది.

అడవిలో గాలీవానా ఉధృతమవడంతో ఆడపావురం ఎగురలేక ఎగురలేక క్రిందపడి పోయినది. వేటగాడు, దాన్ని తీసి తన పంజరంలో పెట్టుకుని వెడ్తున్నాడు. వర్షం మరీ ఎక్కువయ్యేసరికి ఓ పెద్ద వృక్షం క్రిందకు చేరుకున్నాడు. మగపావురం తన భార్యయైన ఆడపావురం కనపడటం లేదని విచారిస్తూ, వేటగాని పంజరంలోని తన భార్యను జూచి సంతృప్తి పడింది. వేటగాడు పడ్తున్న అసౌకర్యాన్ని గ్రహించి, ఓ అతిథి నువ్వు నా భార్యను పట్టుకుని నీ పంజరంలో బంధించావు. అయినా నీవు యీ పెద్ద వర్షంలో మేముంటున్న వృక్షం నీడకు అతిథిగా వచ్చావు కాబట్టీ నీకు ఏం కావాలో కోరుకో అన్నది.

వేటగాడు ముందు చలినుండి తప్పించుకోవడానికి చలిమంట కావాలన్నాడు. వెంటనే మగపావురాలు కొన్ని ఎండు పుల్లలను క్రిందపడేసింది. ఒక జింక ఎండుపుల్లతో వచ్చి మంటను తయారు చేసింది. వేటగాడు తృప్తిగా వేడిని పొంది ఆకలిగా ఉన్నదని తెలియచేయడంతో ఆహారమే కదా, ఇదుగో అంటూ మగపావురం మంటల్లోకి దుమికింది. తనకు తానుగానే వేటగానికి ఆహారంగా మారడం వేటగాణ్ణి ఆశ్చర్యపరచింది. వెంటనే బయటకు వచ్చిన ఆడపావురం భర్త ఆత్మాహుతిని చూసి విచారిస్తూ భర్త కాలిపోతున్న ఆ నిప్పుల్లోకి ఉరికి ఆత్మాహుతి చేసుకుంది. అపుడాకాశం నుంచి ఓ పుష్పకవిమానం వచ్చి, ఆ రెండు పావురాల ప్రాణాల్ని

# ఘంటసాలకు ధీటెవ్వరు?



నా అభిమాన గాయకులే కాదు ఆయన నాకు అత్యంత ప్రియమైన మిత్రులూ, శ్రేయోభిలాషులూ శ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు. సినిమాల్లో పాడడానికి ముందు అలనాటి 1942వ సంవత్సరము క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. ఆ స్ఫూర్తితోనే ఆయన స్వాతంత్ర్యమే మా జన్మహక్కనీ చాటండి, ఆ మొఘల్ రణధీరుల తంతియాతోపీ ఝాన్సీలసమరదీప్తి, అమ్మా సరోజినీ దేవీ, భారతీయ కళా ప్రాభవంబొలికించి తియ్యగా పాడిన కోయిలమ్మ, జయ జయ ఆంధ్ర మాతా, లెమ్ము లెమ్ము ఆంధ్రుడా, లేలేవండోయ్, వెలిగింపవోయ్ ఉజ్వలమైన భక్తితో, అన్న ఘంటసాల గీతాలు వింటూంటే, ఇప్పటికీ ఒళ్లు పులకరిస్తూంటుంది. దేశభక్తితో హృదయం బరువెక్కుతుంది. సినిమాల్లోనూ, బయటా పాడిన భక్తి గీతాలు, భగవద్గీతా శ్లోకాలను విన్న ఎలాటి నాస్తికుడైనప్పటికీనీ ఆస్తికుడు కావాల్సిందే! దేశభక్తి, భగవద్భక్తీ, వృత్తిపట్ల అంకిత భావమూ, గౌరవమూ కల వ్యక్తి ఘంటసాల ఒక్కరేనని ఘంటాపదంగా చెప్పుకోవచ్చు.

తెలుగు సినిమాల్లో ఆయన కూర్చిన స్వరబాణీలు, పాడిన పాటలూ, ప్రోత్సహించిన గాయకులనూ గురించి లిస్టునూ జిస్టునూ చెప్పాలంటే మా ప్రముఖాంధ్ర పేజీలు చాలవు. ఎన్టీ రామారావు, నాగేశ్వరరావులకు ఆయన గళమెత్తి పాడిన పాటలన్నీ, వారు (ఆ నటులు) పాడినట్టుగానే అలరారాయ్. ఈ విషయాన్ని శ్రీ ఎన్టీ రామారావు, శ్రీ ఏ. నాగేశ్వరరావులు కూడా అంగీకరించి, పలు సభల్లో ప్రకటించారు, ప్రస్తుతించారు.

పాత జీవితాన్ని మరచిపోని వ్యక్తి ఘంటసాల. తాను జోలెత్తుకుని మాధవకవళం అడుక్కుని, సంగీతం అభ్యసించానని, ఏ తల్లి తొలుత ముద్ద వేసిందోగానీ, ఆ తల్లిని జీవితాంతమూ మరువలేననీ చెబుతూ, తనకు మేలుచేసిన వారిని మరచిపోయేవారు కారు. ఆయన నేనూ చేసిన తప్పిదము ఒకటే! ఇరువురమూ సినిమాలు తీసి నష్టపోయాం. ఆయన్నుంచీ, నా నుంచీ సేవలు చేయించుకున్నవారూ, స్నేహం చేసినవారూ, లాభాలు పొందినవారూ మాకు తిరిగి సాయం చేయలేదు. అందుకే కృతజ్ఞత లేనిదీ సినిమా పరిశ్రమ అంటాను.

# స్వర్ణ యుగానికి నూతన శతాబ్ది పునాది కావాలి

Life is for just Living బ్రతకడానికే జీవితం అనేది మనిషి ధ్యేయం కాదు, కాకూడదు. శతకోటి జీవరాశుల్లో ఉత్తమమైనది మానవ జన్మ కాబట్టే, జ్ఞానమనేది మానవునికి ప్రసాదింపబడిన భగవదత్తమైన వరం,తరం తరం నిరంతరం జ్ఞానంతో మనిషి బ్రతకడం అవసరం. మనుషుల్లో కొట్లాటలూ, కాట్లాటలూ ప్రజాస్వామ్యంలో అధికమవుతాయని భావించిన భగవంతుడు, ముందు దృష్టితో (దూరదృష్టితో) చాతుర్వర్ణాలను సృష్టించాడు. చాతుర్వర్ణం మయాదత్తం అంటూ – **'చాతుర్వర్ణం మయా సృష్టం గుణకర్మ విభాగశః– తస్య కర్తారమపి మాం విద్ధ్వకర్తారమ వ్యయం'** అని వారి వారిని, గుణకర్మ ప్రకారం విభాగించారు. ఒకరి కర్మల్లో మరొకర్ని చొరబడనీయకుండా, పోటీలకు దిగకుండా, ఎవరి వృత్తుల్ని వారు చేస్తూ, సమష్టి కార్యకలాపాలొచ్చినప్పుడు కలిసికట్టుగా పనిచేసే నీతియుక్త ధర్మంలో నిమగ్నులయ్యేట్టు చేశారు. ఒకరి కష్ట సుఖాల్లో మరొకరు, ఒకరి శుభాశుభ కార్యకలాపాల్లో మరొకరు, పాల్గొనేట్టుగా గ్రామ (రామ) రాజ్యాల్ని తీర్చిదిద్దారు. ఇది భగవంతుని దూరదృష్టికి నిదర్శనం.

'సమానత' అనే నినాదం ఎప్పుడూ తలెత్తలేదు సరికదా 'సహాయకత' 'సౌభ్రాతత' అను ధర్మమే విద్యుక్తధర్మంగా నెలకొన్నది. పూర్వపు ప్రజల్లో 'కులాల'ను కప్పిపుచ్చే విధంగానే నామధేయాలుండేవి. ఆరాధనాలయాలు కూడా అతి కొద్దిగానే ఉండేవి. ఆలయాల ప్రక్కనే మసీదులూ, మసీదుల ప్రక్కనే చర్చిలూ, పోటీలుపడి నిర్మించేవారు కారు. ఒకరి ప్రార్థనాలయాలను మరొకరు గౌరవించేవారు. హిందూ, ముస్లిమ్, క్రైస్తవ, శిఖ్కు, జైన్, పార్శీ సోదరులు 'వారు' ఫలానాయని చెప్పుకుంటే తప్ప వారి 'ఉనికి' తెలిసేది కాదు. అందరూ భారతీయులుగానే ఉండేవారు. అలాటి సమాజం, గ్రామ వ్యవస్థ, సహజ వనరుల రీత్యా యేర్పడిన వ్యవసాయక ఫలం నశించింది. ఇకనైనా గ్రామాలు సకల వనరు, వసతి సంపదలతో వర్ధిల్లుతూ, జనంతో కలకలలాడుతూ, నగర పట్టణాల జనసమృద్ధీ, పారిశ్రామిక కాలుష్యమూ, రాజకీయ పార్టీల కాలుష్యమూ తగ్గుముఖం పడితేనే 'భారతదేశం' పూర్వపు ఔన్నత్యాన్ని పొంద కలుగుతుంది. భారత ప్రజలు అలజడులు లేని జీవితాన్ని సాధించకలుగుతారు. అలాటి స్వర్ణయుగం, స్వర్ణమయజీవితం యీ నూతన శతాబ్దంలో పొంద కలుగుతామనీ ఆశిస్తున్నాను. ●




తీసుకుని వెళ్లిపోవడం, ఆ పావురాల జంట కాలి బుగ్గి కావడాన్ని కళ్ళారా జూచిన వేటగాని కళ్ళు చెమ్మగిల్లడం జరిగింది. అనంతరం అనుకోకుండా అడవిలో మంటలు చెలరేగి నలువైపులా వ్యాపించింది. మంటల్లో వృక్షాలతోబాటు వేటగాడు కూడా ఆహుతియై పోయాడు.

అతిథి కోసం ఆత్మాహుతి కావించుకునే వారుంటారా ఊహాతీత విషయం కదాయని మీరు భావించవచ్చును. కానీ, నీతిని ప్రబోధించే కథలు యిలాగే వ్రాసియున్నాయి. అందులోని సంభవాలను విడిచిపెట్టి, నీతిని మాత్రమే మనం గ్రహించాలి. తిరువళ్ళువర్‌కూడా యిలాగే చెప్పారు. పేదవాళ్ళకిచ్చే దానం, మిగతావారంతా ఏదో ఎదురు చూసి చేసే కార్యమే. రాజులు చేసే యాగం, వాళ్ళు పొందిన బహుమతులూ, గౌరవాలూ ఆచరించినదానికి ఫలితం ఆశించడమే అవుతుంది. పాండవులు చేయిన యాగం అటువంటిదేననవచ్చు. అతిథికి బార్లీ జావను అందించినపేద బ్రాహ్మణుడు ఏమి ఆశించి చేశాడు? వేటగానికి ఆహారంగా ఆహుతియైన పావురం ఏమి ఆశించినది? ఒకరికి ఏదైనా యిచ్చేటపుడు, ఆశించి చేయకూడదు.

ఈ విషయాన్నే జీవితం నుంచి వాణిజ్యానికి ఉదాహరణంగా తీసుకోండి.పరులకు యిచ్చినదానాన్ని చేసినవెంటనే మరచిపోండి. పనివారలకు ఏదైనా సహాయం చేయాలనుకుంటే వెంటనే చేయండి. సంతృప్తిగా చేయండి. మీరు ఇచ్చినది ఎపుడూ చెప్పుకోకండి. దానం పొందినవారే చెప్పుకుంటారు.ఆకాశం నుంచీ పుష్పక విమానం రాకపోయినప్పటికినీ, జనుల గుండెల్లో కలకాలం జీవించగలుగుతారు. అదే తృప్తి అనుకోండి చాలు. ●

# నన్నె చోడుని తెలుగు పద్య అలంకార చమత్కృతి

**ఆలవు చాలవు గడుఁగొను - రాలవు గోమలివి ముద్దరాలవు తగమం చాలవు బేలవుగా కిది - కాలమె తపమున కపారా కాంతారములన్‌॥** - అన్నాడు 'కుమార సంభవం' తెలుగు కావ్యంలోని ఆరవ ఆశ్వాసంలో శ్రీ నన్నెచోడుడు. ఈయన 12 వ శతాబ్దమువాడు. తన కావ్య రచనముల్లో ఎక్కువగా జానతెలుగును వాడినట్టు పై కావ్యమే ఋజూపరుస్తున్నది. అష్టాదశ వర్ణనలతోబాటు, శబ్ద అర్థాలంకారములను వాడుటలో మేటి. ఆయనకు కవిరాజ శిఖామణి యనే బిరుదము నప్పినట్టు ఒప్పారుచున్నది.

పర్వతరాజు యొక్క కుమార్తెయైన పార్వతి పరమశివునినే వివాహమాడవలెననెడి పంతం పట్టింది. అందు నిమిత్యార్థమై, శివానుగ్రహం కోసం తీవ్ర తపస్సును చేయడానికి సిద్ధమైంది. పార్వతి మనోరథాన్నెఱింగిన హిమవంతుడామెను తపోవనానికి వెళ్ళవద్దని **'అనునయపు'** మాటల్ని చెబుతాడు.

**'తపము'** అంటే మాటలా, ఎంతటి కష్టముతో కూడుకున్నదో నెఱుగుదువా? నీవు చిన్నదానవు, అన్నెము పున్నెము నెరుగని దానవు– యని చెప్పడానికా కవిరాజు – ఆలవు, బాలవు, కొమరాలవు, ముద్దరాలవు 'ల' 'వ' జంట ప్రాసలను ప్రయోగించి తెలుగు భాషకు యింపుసొంపులను గూర్చారు. ద్విత్వాక్షఱ, తృత్వాక్షఱ ప్రయోగములు అరుదుగా కనిపించే నీ పద్యమును పద్యరాజమనే చెప్పవచ్చును. ఉపమాన ఉపమేయాలలో పద్య పదారంభ పద్య పదాంతములతో 'డ' అక్షఱ ప్రయోగంతో అతడు పలికిన హితవు కూడా కడు రమ్యాతి రమ్యంగా **'పూగుత్తి కెంగేలన్ దాల్చిన'** అను బమ్మెర పోతనామాత్యుని పద్యంలోని యింపుసొంపుల ప్రయోగంలా– **ఇద్ద బొట్టువోలె నింటిలో నుండకే - యాఁడు దానవింత యదరి బాస - నడవిలోనుఁ తపము పడవోదు ననునంత - జఱభితనము లెందుఁ గఱచి తీవు?** యని తేలిక పదాల్లో బరువైన భావాల్ని ప్రోదిచేసారు. రిజర్వేషన్లను కోరుతున్న ఇప్పటి ఆడవాళ్ళు యీ పద్యభావాల్ని కొనగోటితో కొట్టివేసినప్పటికిని, కోటి గొంతులతో ఆయన పలికిన సాత్విక భావాన్నీ, సాధ్వీమణి తత్వాన్ని నేను ఇక్కడ వివరించక తప్పలేదు.

అమ్మా, నీవు ఆడదానివి, నొసట దిద్దిన బొట్టులా నీవు ఇంట ఉండాలే గానీ, అడవులకు వెళ్లి తపస్సుచేస్తా నంటా వెందుకమ్మా– అంటూ యింతటి ధైర్యము, సాహసములు నీవు యెక్కడ నేర్చుకున్నావమ్మా– ఇది నీకు తగునా అనెడి హితవు యీ పద్యంలో నిర్దుష్టముగా, తేలికైన భావాల్తో, సుస్పష్టమైన రీతిలో ద్యోతక మవుతున్నది. తెలుగుభాషను తెలుగువారు సుందరంగా నేర్వవలెనేగానీ, అందలి అంతర్మాధుర్యములను నేనెంతగా చెప్పిననూ 'ఇద్దబొట్టు' లా అర్థము కావు. 'జఱభితనము' అనే తెలుగు పదాన్ని విన్న తెలుగువారు ఈనాడు అరుదుగా కనిపిస్తున్నారు. సంకటముకాని మన భాషను మనం నేర్చుకోవాలన్ననూ, మన తెలుగు భాషలోని వెలుగు రేఖల్ని మనం చూడలన్ననూ, నన్నె చోడుని వంటి ప్రాచీన తెలుగు కవుల పద్యాలను చదవాలి. సులభగ్రాహ్యమైన వారి శైలే సుందర తెలుగు. ఇప్పటికైనా తెలుగువారూ **తెలుగును అభ్యసించండి; తెలుగు భాషా మాధుర్యాన్ని ఆస్వాదించండి!!** ●

# కర్ణుని పేరు కర్ణపేయము!



కర్ణుని పేరు కర్ణపేయము. ఆహా ఏఁవి తెలుగు కవుల పదచాతుర్యం, పద మోహరింపు, భావముల గుణింపుల్లో ఎంత ప్రతిభాశీలురో కదా!

పద్యము తెలుగువారికి ప్రాణము. కవులు తమ ఘంటములతో, కలములతో శ్లోకాలనూ, కావ్యములనూ శ్రవణపేయం కావించారు. మధ్యయుగ కవుల్లో గుఱ్ఱం జాషువా గారి పేరును విననివారుండరు. వారు తమ పదజాలము సొంపులను గూర్చి శబ్దార్థ చతురతతో నింపెడివారు. ప్రాచీన, నవీన కథా వస్తువులతో ఎన్నో కవితలను కూర్చిన కవిశ్రేష్టుడు. ఆయన ఎక్కువగా కావ్యములనే వ్రాశారు. నవయుగ కవి చక్రవర్తిగా భాసిల్లినారు. వారి 'కర్ణుడు'లోని యీ పద్యమే చూడండి.

**వీరాగ్రేసర! నీవు పాండవ బలాబ్ధిన్ మందరం బట్టుదో**
**స్సారంబార మథించి యంచిత యస్సారంబు లోకంబునన్**
**బారం జల్లిన సద్దనుద్ధరఁడ నెవ్వండీడురా? నీకుఁగ**
**ర్ణా రాజన్యులకెల్ల నీచరితమన్నన్ గర్ణ పేయం బగున్!**

ఏమయ్యా కర్ణా - నీవు పాండవ సేనాసాగరాన్ని నీ భుజబలం కొండగా చేసుకుని మథిస్తున్నావే, నీ ధైర్య సాహసాలు అమోఘమయ్యా– నీ సత్కీర్తిని సమస్త లోకమునకూ వ్యాపింపచేస్తున్నావ్. నీవు మేటి విలుకాడవు. నీకు నీవే సాటి, నీ ధాటికి దీటు ఎవరూ లేరు. నీ చరిత్రము పరమ పవిత్రమే కాదు, కర్ణపేయమైనదయ్యా - అంటూ స్తుతించారు జాషువాగారు. ఆయనభావాల సరళి 'గుర్రం' వలె పరుగిడుతుందనుటకు పై పద్యమే ఉదాహరణం!

**ఓ తెలుగువారూ– తెలుగు నేర్చుకోండి! ఇలాంటి పద్యాల్లోని అందాన్ని చవిచూడండి!**

Lovely Stay at Holy Tirupathi The Gateway of Lord Balaji

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# భక్త జనులను పాలించే విష్ణు తులసే శ్రీకృష్ణ తులసి! శ్రీ-రాగ రోగాలను నశింపచేస్తుంది, దైవీక శక్తిని ప్రసాదిస్తుంది!



**శ్రీతులసి ప్రియ తులసీ**
**జయము నీయవే - జయము నీయవే!**
**భక్తజనుల పాలిచే విష్ణు తులసివే-**
**శ్రీకృష్ణ తులసివే!**- అంటూ ఆంధ్ర ఆబాలగోపాలమూ పాడుకొనే మంగళ గీతమెంతో మహత్తరమైనదీ, మంగళకరమైనదీ! ఆడవారికి, మగవారికి, ఆ బాల వృద్ధులకీ తులసి మహిమను వివరించాలనే ఉద్దేశ్యంతో అగస్తియర్ విజయం మార్చి 2000 మాసపత్రికలోని వ్యాసాన్ని హృదయాలకు హత్తుకునే విధంగా విశ్లేషిస్తున్నాం.

మంచి షోడశ ఫలితాలనిచ్చే నిత్య పూజాతులసీ తిరు అణ్ణామలైలోని శ్రీఅగస్తియర్ ఆశ్రమంలోనూ, చెన్నయ్‌లోనున్న వారి అగస్తియర్ కేంద్రాలయంలోనూ పెరిగి నిత్యపూజలందుకుంటున్నట్టూ తెలుస్తూన్నది. జగత్కారణమూర్తీ, జగత్కల్యాణమూర్తీయైన మహా విష్ణుమూర్తి పరిపూర్ణానుగ్రహంతో దేవమూలికగా విష్ణు తులసి ఉంది. ఈ తులసినే శ్రీకృష్ణ తులసియని కూడా అంటారు. నీల మేఘచ్ఛాయలో ఔషధశక్తీ గుణాలు కల యీ తులసి. నిరంతరమూ మహా విష్ణువుని శరీరచ్ఛాయను స్పృశిస్తున్నందువలన ఆయన ఉఛ్వాస నిస్వాసల కారణంగా అద్భుత శక్తిని కలిగి తమిళంలో 'తిరుత్తుళాయ్' అనే అద్భుత నామం కలిగి ఉంది.

సూర్యోదయ, సూర్యాస్తమయమందు తులసీ ప్రదక్షిణ చేస్తే, కోటి దోషములు కూడా తొలగిపోతాయట. అందువలన గృహాలలో గృహ ప్రాంగణముల్లో 'తులసిమొక్క'ను ప్రతిష్టించుకోవడం చాలా అవసరం. మనం అనునిత్యమూ బయటకు వెళ్లి వచ్చేటపుడు అనేకానేకమైన దోషములు మన పాదముల ద్వారాను, తదితర సర్వేంద్రియముల ద్వారాను దుస్తుల ద్వారానూ సంక్రమిస్తూంటాయ్. ఇంటి నుంచి బయలుదేరే ముందు తులసి మఠమునకు (కోటకు) ప్రదక్షిణము చేసి వెడుతూంటే, ఆ దోషములు మనల్ని అంటకుండా ఉంటాయ్. తెలిసీ తెలియక దరి చేరే యీ దోషాలను తులసి నుంచి వచ్చే వాయు వీచికలు మనల్ని **'రక్షణకవచం'**లా కాపాడుతాయి. అయితే నగరముల్లో బయల్దేరుతున్న **ఫ్లాట్‌సిస్టమ్** యిళ్ళ నిర్మాణం జరుగుతున్నది. తులసి చెట్టును, తులసీ కోటను కట్టగలమా, అనే అనుమానం కలుగవచ్చు. అందుకు పోర్టబుల్ సిమెంట్ మటాల్లో తులసి మొక్కను ప్రతిష్టించి, ఉదయ సంధ్యా సమయాల్లో పూజా ప్రదక్షిణము వంటి ప్రార్థనల్ని చేసుకోవచ్చు. కలియుగంలో కలిమాయ ద్వారా కలిగే దుష్టశక్తుల ప్రాభవాన్ని ముందుగా గ్రహించిన మన పెద్దలు తులసి దళపూజా నియమాలను సుబోధకంగా బోధించి వున్నారు. తులసి నవవిధ రంగులూ, నవవిధ శక్తులూ కలిగి వున్నదని కూడా చెప్పారు.

భూదేవిపై ప్రతిష్ఠించిన అర్చనా పాత్ర వలె 'తులసి' వున్నందున, తులసిని చుట్టూ ప్రదక్షిణం చేసి వచ్చేటపుడు మన పాదాల (అరికాళ్ళ)లోని రేఖలు భూమి ఆకర్షణ శక్తివలన, భూమాత శక్తులు మన పాదరేఖలను అంటి, యావత్శరీరంలోకీ ప్రవేశిస్తాయ్. హృదయం కమలంలా విరిసి, దృఢ తరమవుతుంది. ఈ భూమ్యాకర్షణశక్తే దైవశక్తిగా వరవి, ధృఢశక్తినిస్తుంది. గుండెకు శస్త్ర చికిత్స చేయించుకొనేవారూ, గుండెనొప్పి కలవారూ, హృదయంలో లోపాలు కలవారూ తులసిచెట్టు ప్రదక్షిణం పాదముల ద్వారా శరీరానికి, గుండెకూ మంచి శక్తినీ, మీదుమిక్కిలి ఉత్సాహాన్నీ ఉత్తేజాన్నీ యిస్తుంది. పాదంలోని రేఖలు ద్వారా హృదయంలోనూ, తద్వారా శికపాలం (శిరస్సు)లోని రేఖలకూ శక్తి ప్రసారం జరిగి మంచి ధృఢమైన ఆరోగ్యాన్ని కల్గింప చేస్తూంది. పాండవుల్లో చివరివాడైన సహదేవుడు మహా తెలివైనవాడుగా, శక్తిమంతునిగా, తేజోవిశాలునిగా తులసిపూజ, తులసి ప్రదక్షిణం ద్వారానే దీప్తి చెందినట్టు పురాణం చెబుతూన్నది. పాండవాగ్రజులకూ యే ఆపదలు వచ్చినప్పటికీనీ సహదేవుడు తులసిపూజ ద్వారా సముపార్జించిన అతీంద్రశక్తి వలన, దైవశక్తి వలన అవరోధాలను అధిరోహింపచేసేవాడట. శ్రీకృష్ణ పరమాత్మ అనుగ్రహించే పాండవులకు సంప్రాప్తమైన తులసిచెట్టు, సహదేవుని ఆరాధనలతో వారికి సర్వవిధాలా తోడ్పడింది. సర్వసర్వేత్రా విజయపరంపరలనూ సాధించేట్టు చేసింది. సహదేవుడు అరవైనాలుగు కళల్లోనూ ఆరితేరాడంటే యీ తులసి వృక్షమే కారణం. ఆ సహదేవునిచే అర్పింపబడిన వంశవృక్ష సంతతే తిరు అణ్ణామలై అగస్త్రాశ్రమంలో షోడశ నిత్య పూజలందుకుంటూ సూర్యచంద్రుల కాంతి ప్రసరణంలో భక్తజనుల నిరతాభివృద్ధికి కల్పవృక్షంగా వరలుతుంది. ఆలయాల్లో ప్రసాదంగా యిచ్చే 'తులసిదళము'ను భక్షించినందున సకల దోషములూ తొలగడమే గాకుండా, సకలాయురారోగ్యములూ సిద్ధిస్తూంటాయ్. ●





# ఆదిశంకర తత్త్వం

ఆదిశంకరాచార్యులు వారిని – శృతి స్మృతి పురాణానామాలయం కరుణాలయమ్– అని కీర్తిస్తారు. అంటే ఆయన వేదశాస్త్రాభిజ్ఞుడు – కరుణా కృపాదయాళుడని అర్థం.

గురుముఖోద్బోధన మూలకంగా, శిష్యుల వీనులగుండా గ్రహింపబడి, తద్వేదసారం గుర్తింపబడి, అధ్యయనం సలుపబడడం వలన వేదములను శ్రుతు లంటారని భావిస్తాను. ఆదిశంకరులు అటువంటి ప్రక్రియనే చేబట్టి, ఆచార్యోత్తము లయ్యారు. సనాతన ధర్మ పునః ప్రతిష్టను సునాయాసంగా చేశారు. ఆయన విరచిత గోవింద ద్వాదశ మంజరిక స్తోత్రమ్– ఇందుకు ప్రత్యక్షసాక్ష్యం.

కాశీనగరంలో ఒకానొక ఉషఃకాలమున శ్రీశంకరులు గంగాస్నానమునకు వెడ్తున్నపుడో బ్రాహ్మణ పండితుడు– **డుకృఞ్ కరణే**– అనే వ్యాకరణ సూత్రాన్ని పఠించడం చూచి, వట్టి ఆ సూత్రం వలన ప్రయోజనం లేదన్న భావంతో – **'భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే! సంప్రాప్తే సన్నిహితే కాలే! నహి నహి రక్షతి డుకృఞ్ కరణే'** అన్నారు. సకలములకూ కారకుడైన గోవిందుని నామం భజించు. గోవిందుణ్ణి సేవించు 'డుకృఞ్ కరణే'– యీ వ్యాకరణ పాఠాలు మరణకాలం ఆసన్నమైనపుడేఁవీ రక్షించలేవు సుమా!

**మూఢ జహీహి ధనాగమతృష్ణాం**
**కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్**
**యల్లభసే నిజ కర్మోపాత్తం–**
**విత్తం తీన వినోదయ చిత్తమ్**– అంటూ రెండవ మంజరి చెబుతూ– మూఢుఢా ధనం సంపాదించాలనే అత్యాశను వెంటనే విడిచిపెట్టి, ఆశాపాశములు లేని సద్బుద్ధిని అలవరచుకో– కృషితో నాస్తి దుర్భిక్షమ్ అన్నట్టు – నీవు చేసిన కృషివలన నీకు న్యాయంగా ఏది లభిస్తుందో అద్దానితోనే తనువును సంతృప్తి పరచుకో– మూఢమతీ గోవిందుని భజించు– అంటూ 14 మంజిరులు చెప్పి– పన్నెండవ మంజిరలో ప్రకృతీ, జీవిత సార విధానాన్ని ముచ్చటిస్తూ–

**దినయామిన్యౌ సాయం ప్రాత**
**శ్శిశిర వసన్తౌ పునరాయాతౌ**
**కాలః క్రీడతి గచ్ఛ త్యాయు**
**స్తదపి నముఞ్చ త్యాశావాయుః** – అన్నారు.

రాత్రీ పగలూ, ఉదయం సాయంత్రాలూ, శిశిర వసంతాది ఋతువులూ ఒకదాని వెంబడి ఒకటి వచ్చి పోతుంటాయ్ ఇది కాలక్రీడా సహజం. ఇలానే నీ ఆయువు రోజురోజుకీ క్షీణదశకు చేరుతూన్నప్పటికినీ, నీలోని మోహపిశాచం నిన్ను విడిచిపెట్టదు. కావున మూఢమతీ కళ్లు తెరచి గోవిందుణ్ణి భజించు అన్నారు.


# భారత్‌నుంచీ అమెరికా! అమెరికా నుంచీ భారత్‌కు రాకపోకలు ఎంతో కాలంగా ఉన్నాయ్!

అమెరికాలోని ముఖ్య నగరాలకు భారతీయులు వెళ్లడం, అక్కడ వృత్తి ఉద్యోగాల్లో నియామకం కావడం ఎంతో కాలంగా జరుగుతూనే ఉన్నది. ఎంతోమంది అమెరికా పట్టణాల్లో స్థిరనివాసంగా ఉండడమూ జరుగుతూనే ఉన్నది. ఎక్కారణంగానూ వారు భారతీయతను, సాంప్రదాయాన్నీ విడిచి ఉండడం లేదు. పండుగలనూ, పర్వదినాలనూ భారతీయ సాంప్రదాయాల్లోనే జరుపుకుంటున్నారు. భారత సాంప్రదాయ దుస్తులతోనే వ్యవహరిస్తున్నారు. భారతప్రార్థనా మందిరాల్లో నిరతమూ కలుసుకుంటున్నారు; నియమ నిష్టలను పాటిస్తున్నారు. దశాబ్దకాలంగా పర్యటిస్తున్న నాకెట్టి వ్యత్యాసాలు కనిపించడం లేదు. కొన్ని ప్రదేశాల్లో వారానికొక పర్యాయం, ఒక ఇంటి వద్ద వారు కలుసుకుంటూ సత్సంగాలు జరుపడాన్ని ప్రత్యేకంగా చూసాను. నేనూ పాల్గొన్నాను. నాకు అన్య ప్రదేశంలో ఉన్న అనుభూతి ఎప్పుడూ కలుగలేదు. ప్రకృతి పచ్చదనం ప్రతి ఇంటి చుట్టూ కనిపిస్తుంది. పచ్చిక కనిపిస్తుంది. వీథుల కిరువైపాల ఉన్న చెట్లను నరికే హక్కు ఏ పౌరునికీ లేదు. ఇలాటి పచ్చదనం భారతీయ నగరాల్లో కనిపించదు.

నేను అరవై సంవత్సరాల క్రితం మద్రాసు (ఇప్పటి చెన్నయ్) వచ్చినపుడు త్యాగరాజనగర్, మైలాపూరు ప్రాంతాల్లో ఈ పచ్చని వాతావరణాన్ని చూసాను. ప్రతీ గృహ పరిసరాల్లో పచ్చదనం కనిపించేది. వీథి కిరుప్రక్కలా పచ్చని చెట్లు ఉండేవి. ముఖ్యంగా త్యాగరాజనగర్‌లోని ఉస్మాన్‌రోడ్డు, త్యాగరాజరోడ్, వెంటక నారాయణ రోడ్, గోపతి నారాయణ చెట్టి రోడ్‌లలో ఈ పచ్చని వాతావరణం బాగా కనిపించేది. హరితవనాలు కనిపించేవి. అవన్నీ అదృశ్యమయ్యాయ్. ఏ రోడ్డు మీద చూచినా వాహనాలు, రోడ్డు కీ ప్రక్క నుంచీ ఆ ప్రక్కకు వెళ్ళాలంటే ఏ వాహనం దూసుకుని పోతుందో ననే భయం. నేనుంటున్న అశోక్‌నగర్ సెవెంతు అవెన్యూలో కూడా ఈ ప్రక్క నుంచీ ఆ ప్రక్కకు వెళ్ళాలంటే భయం. మోటారు సైకిళ్లవాళ్ళు క్రూరంగా వెళతారు. మా యింటి కెదురుగానే నాలుగు వీథుల కూడలి ఉంది. ట్రాఫిక్ సిగ్నల్లు లేవు. ట్రాఫిక్ పోలీసు ఉండడు. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని దాటాలి. మోటారు సైకిళ్ళలో దూసుకు వెళ్లే వారిని నియంత్రించే పరిస్థితి లేదు!

# రాజాలా జీవనయానము కొనసాగించిన పి.వి. రమణయ్యరాజా!

ఆయన యాదాళం కంపెనీ ఎల్వీ రామయ్యతో కమీషను వ్యాపారం కొనసాగిస్తున్నప్పుడెవరో తెలియదు; అక్కణ్ణుంచీ బయటకు వచ్చి కమీషను వ్యాపారం ప్రారంభించిన వెంటనే కుర్తాళం జలపాతంలా వ్యాపార విజృంభన చేయడంతోబాటు కళాసాహితీ రంగాల ప్రోత్సాహకునిగా, పోషకునిగా ప్రోద్బలకునిగా కుర్తాళం జలపాతంలా విజృంభించిపోయారు. రాజ్యలక్ష్మీ అవార్డును ప్రవేశపెట్టి, ప్రతీ సంవత్సరమూ భూరి మొత్తాన్నిస్తూ, సాహితీ సమరాంగణా చక్రవర్తి అయిపోయారు. మొదటి అవార్డును మహాకవి శ్రీశ్రీకి ప్రదానం చేసినట్లు ఈ కలానికి గుర్తు. ఇదోరకంగా నోబుల్ అవార్డుతో సమ ఉజ్జీగా దీప్తి చెందింది.



ఆయన వ్యాపారం నిమిత్తార్థం విశాఖపట్టణం చేరిన తరువాత ఆధ్యాత్మిక గురువరేణ్యులు కందుకూరు శివానందమూర్తి మహోదయుల శిష్యరికం లభించింది. దానితో ఆ అవార్డును శివానంద మూర్తుల అవార్డుతో కలిపి వేసారు. ఆయన కత్యంత ప్రియశిష్యులై వారి ఆనందవనమునకే మకాము మార్చివేసారు.

చివరి క్షణం వరకూ వారి శిష్యరికంలోనే జీవితం కొనసాగించారు. కమీషను వ్యాపారాన్ని అపారంగా చేసిన రమణయ్యరాజా ఇక వ్యాపారం వైపు దృష్టిని ప్రసరించలేదు. ఆయన అనుంగు సతీమణి రాజ్యలక్ష్మి మరణించడం కూడా ఆయన వ్యాపార వైరాగ్యానికి కారణమైంది.

ఆయనుండగానే పెద్దకుమారుడు వ్యాపార బాధ్యతలను చేబట్టారు. చిన్న కుమారుడు పి.వి. కృష్ణారావు తన అభీష్టానికి తగిన వ్యాపారాన్ని కొనసాగిస్తూ, ప్రజా సంబంధ కార్యక్రమాల్లో, ముఖ్యంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. చెన్నయ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం స్థానిక పాలకమండలిలో అపారమైన సేవలు చేసారు.

ఆధ్యాత్మిక ఉపన్యాస చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుగారి చెన్నయ్‌లోని ఉపన్యాస కార్యక్రమాలు చెలువంగా అభివృద్ధి పొందుటకు పి.వి. కృష్ణారావు కృషి అమేయంగా ఉంది. ఏ ధార్మిక కార్యక్రమం జరిగినా పి.వి. కృష్ణారావు సహాయం ఉండకుండా ఉండరు. నీరు తొణకని నిండుకుండలా తానిది చేస్తున్నట్లు చెప్పడు. కానీ కార్యక్రమ భాగస్వామ్యంలో అహరమూ సేవా ధర్మంతో తాను అడుగువేస్తాడు. అకుంఠితంగా పనిచేస్తాడు. చిరువయసులోనే ధృవునిగా కృషి చేసే కృష్ణారావును ధృవుడనాలో ఏమనాలో నాకు తెలియడం లేదు. కానీ వాళ్ళతో పోల్చదగినవాడని మాత్రం చెప్పగలను. తండ్రికి మించిన తనయు లుంటారనెడి విషయం నిజమనిపిస్తున్నది.

పి.వి. రమణయ్య రాజాను తలపింపజేస్తున్న ఆయన తనయుడు పి.వి. కృష్ణారావును ఉదహరించకపోతే, నేనో తప్పు చేసినవాడినవుతానని, ఈ రమణయ్యరాజాను తలచుకున్నప్పుడు రమణుడు కృష్ణారావును తలచుకోవాలనే ఈ వ్యాసం ముగిస్తున్నాను.

ప్రతీ వ్యాసానికీ ఒక ముగింపు ఉండాలని గానీ, రమణయ్యరాజా గురించి వ్రాయడానికి ముగింపే ఉండదు.

సాహితీ సమరాంగణా చక్రవర్తితో సముడన్నా, కందుకూరి శివానంద మూర్తి గురుభక్తీ ప్రియుడన్నా పి.వి. రమణయ్యారాజానే చెప్పుకోవాలి. రమణయ్యరాజాకు సముడు రమణయ్యరాజయే గాని అన్యులు లేరు; అనన్యులూ లేరు– అని వక్కాణించి చెప్పగలను. ●

# ప్రజల్లో కల పరస్పర ద్వేషం, అంతర్భరిత బాధలూ పోవాలి! అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది!

INDIAN LITERATURE IS ONE THOUGH WRITTEN IN MANY LANGUAGES AND SCRIPTS – అన్నాడు మేధావీ, భారతదేశపు ద్వితీయ రాష్ట్రపతియైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణపండితులు. భారత సాంస్కృతీ సాంప్రదాయాలు చరిత్రపరంగా సనాతనధర్మంతో ముడివేసుకుని ఉన్నాయ్. మతం మనుష్యుల్ని చీలుస్తుందనెడి భావంతో, భరతవర్ష చరిత్రలో మతాలంటూ పేరుపెట్టి సృష్టింపబడలేదు. మత ధర్మపరంగా మనుషుల్ని విభజించలేదు. – **చాతుర్వర్ణం మయాదత్తమ్** అని జనులు ఒకర్నొకరు కొట్టులాడు కోకుండా ‘భగవానుడూ, జగద్గురువైన శ్రీకృష్ణభగవానుడు– వృత్తిపరమైన చతుర్వర్ణాలు కల్పించి ఒకరికొకరు సామాజిక సహజీవనంలో తోడ్పడేట్టుగా చేశారు. కానీ కొందరు దీనికి అధికులనీ, అధములనీ విపరీత వ్యాఖ్యలు చేసి, అస్పృశ్యత వాతావరణాన్ని సృష్టించి, సమాజ సహజీవన, సమైఖ్యతా వాతావరణాన్ని కలుషితం చేశారు. కులాలు, మతాలు పరంగా దేశం భ్రష్టుపట్టే వాతావరణాన్ని కలుగచేశారు. వలస వచ్చిన విదేశీయులకూ, దండయాత్ర (దోపిడీ) దారులుగా విచ్చేసిన అన్యదేశీయులకూ అనువుగా తోచింది. సనాతన ధర్మపరమైన అమాయకతనూ, అసూయనూ, అలుసుగా చేసుకుని, ప్రజల్ని బలిపశువుల్ని కావించి, తమ తమ అభిమతాల ప్రకారం, అపార వ్యాపారపరంగా ఉన్న తమ మతాలలోకి జనాన్ని కలుపుకున్నారు. ఆర్థిక లేమి, ఆదుకునే హృదయం లేకపోవడంతో ముస్లిములుగా, క్రైస్తవులుగా, బౌద్ధులుగా అన్యమతాల్లోకి మారిపోగా శేషించినవారు హైందవులుగా, హిందూమతస్థులుగా నిలపడం కోసం హిందూ మతాచార్యులూ జగద్గురువులైన శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు వారలు త్రిమతాచార్యులుగా విశేష కృషిని సలిపి, ఆధ్యాత్మక పరమైన సనాతన సిద్ధాంతాన్ని పునఃస్థాపితం చేసినప్పటికినీ, ప్రజల్ని మూడు వర్గాలుగా చీల్చివేశారు.

అంతకు పూర్వం బౌద్ధంలో పోగా మిగిలిన యీ మూడు వర్ణాలవారు మాత్రమే హిందువులుగా, హిందూమతస్థులుగా స్థిరపడిపోయారు. అయితే అనంతరం యీ మత పీఠాలనధిష్టించిన పీఠాచార్యుని ఛాందస భావాలు కారణంగా మడీ, దడీ, అస్పృశ్యతా విధానం పెచ్చుపెరిగి కులవైషమ్యం కారుచిచ్చులు రగిల్చింది. ఒక వర్గంపై ద్వేషం (బ్రాహ్మణ ద్వేషం) అంకురించింది. భూమిపై అంకురించిన యీ ద్వేషం ఆకాశం స్థాయికి ఎదిగి అంబరాన్ని చుంబించి బ్రాహ్మణేతరులనీ, బ్రాహ్మణులని విభజిస్తూ కుల విభజనల్ని వృత్తిపరంగా గాకుండా, ప్రవృత్తిపరంగా పెంచివేశారు. గోరంత నిజాన్ని ఆసరాగా చేసుకొని కొండంతలు చేసి, కొండల్ని సహితమూ పిండిచేసి, ద్వేషాగ్నితో బుగ్గి చేయడానికి దిగుమతియైన రాజకీయపార్టీలు విశిష్టంగా కృషి చేశాయ్. ఉన్నవాడూ– లేనివాడూ, శ్రామికుడూ– పారిశ్రామికుడూ అంటూ పరస్పర సహజీవనం జరిపే మనుష్యుల మధ్య అగాధాన్ని సృష్టించారు. బహుపార్టీల ఉనికికీ, మతాలుగా జనం ముష్టిఘాతాలకు దిగడానికి ఆస్కారం కల్పించింది. ఆవేదనను పెంచింది. దీనికి తోడు భాషాపరమైన బేధాలూ జనం మధ్య అవగాహనం లోపించడంతో భరతవర్షంలో చీలికలు పెరిగి, విశ్వశాంతిలో విస్తృత పరిధిని భూకంపాలను సృష్టించింది. ఇంకా సృష్టిస్తూ వస్తున్నది.

భాషలు మనుష్యులను ఐక్యం చేయడానికి ఏర్పడ్డాయనీ, సఖ్యతను పెంచుతాయని. భాషకూ భాషకూ మధ్య సేతువు కట్టి బంధింపచేస్తాయనీ, ఎవరూ గ్రహించడం లేదు సరికదా గ్రహింపచేయడానికి రాజకీయ వర్గాలు అడ్డుగోడలుగా నిలుస్తున్నాయ్. అట్టడుగు వర్గాలవారిని విద్యావేత్తలుగా మేధావంతులుగా తీర్చుదిద్దుతాయని పది సంవత్సరాలు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిన అంబేడ్కర్ మహాశయుని ఆశయం ఫలించలేదు. పదేపదే యీ రిజర్వేషన్లు పెంచడంతో అట్టడుగు వర్గాలవారు మేధావంతులు కావడానికి బదులు రాజకీయ కాలుష్యాన్ని పరస్పర ద్వేషాన్ని పెంచుకుంటున్నారు. దీనివలన దేశాభివృద్ధి కుంటుపడ్తుంది. ●

# సర్వారాయ ట్రస్టు అనగానే రామాయణ సర్వస్వమూ ధ్వనిస్తుంది!

రాముడు భారతీయుల ఆరాధనీయుడు. శ్రీరామధర్మాన్నే భారతదేశం ఆరాధ్యంగా చేసుకున్నది. జాతిపిత గాంధీగారికి కూడా రాముడే ఆదర్శపురుషుడు.

భారతదేశం రామరాజ్యంగా వర్ధిల్లాలని ఆయన కలలుగన్నాడు. ఆయన ప్రాణాలను కోల్పోతూ 'హేరామ్' అంటూ అసువులు విడిచాడని అంటారు.

భారతనేలలోని అణువణువునా రామశబ్దం వ్యాప్తినొంది ఉన్నది. అలాటి ఆదర్శవంతమైన కథను కపిలేశ్వరపురంలోని సర్వారాయ ట్రస్టు వారు బహు కృతులుగా ప్రచురించి, రామకథను దేశవ్యాప్తం చేసారు.

ఆధ్యాత్మరామాయణం, శ్రీమదాంధ్ర రామాయణం, వాల్మీకి రామాయణం మూల ప్రతుల సిద్ధాంతాన్నీ సేకరించి ప్రచురించినట్లు వినియున్నాం.

2010 సంవత్సరం మార్చి21న ఆంధ్రజ్యోతి ఈ వివరమును సంక్షిప్తముగా వివరించడాన్ని బట్టి తెలుస్తుంది. మా అభిమాన పాఠకులెవరైనా యీ గ్రంథాలను పంపిస్తే శిరోధార్యంగా భావిస్తాం. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించిన యీ శ్రీరామకథా గ్రంథసారాంశాన్ని ప్రపంచ తెలుగు ప్రజలకు అప్పుడప్పుడు రుచ్యం కావిస్తుంటాం. మాకు లభించిన 'ఆంధ్రజ్యోతి' ముద్రణా పేజీ మూలంగా తెలియజేస్తున్నాం.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు వేదాలు ప్రాణం అయితేవేదాల్లో ఉన్న భాషా చాలా ప్రాచీనమయినది. ఆ భాష పండితులకు కూడా పూర్తిగా అర్థంకాదు. ఇది గ్రహించిన మహర్షులు వేదాల్లో ఉన్న నీతి, న్యాయం, ధర్మం అందరికీ అర్థమయ్యేలా లౌకిక సంస్కృత భాషలో కథలు కథలుగా రాయడం ప్రారంభించారు. వారిలో ముఖ్యుడు, ప్రథముడు వాల్మీకి మహర్షి. లౌకిక సంస్కృత భాషలో తొలిసారిగా కావ్యరచన సాగించిన వ్యక్తి వాల్మీకి కావడం వల్లే అతనిని ఆదికవి అన్నారు. ఆయన రచించిన రామాయణాన్ని ఆదికావ్యంగా పేర్కొన్నారు. దీనికే సీతాచరిత్ర, పౌలస్త్య వధ అని మరో రెండు పేర్లున్నాయి. ఇది సప్తకాండలుగా, 500 సర్గలు. 24 వేల శ్లోకాలతో వర్ధిల్లుతోంది. ఈ రామాయణాన్ని అనుసరించే అనేకమంది కవులు రకరకాల రామాయణాలను పునర్లిఖించారు. పురాణాల్లో కూడా రామకథలున్నాయి. పద్మ భాగవత, నారదీయ, అగ్ని, బ్రహ్మ, వైవర్త, వరహా, కూర్మ, మార్కండేయ, గరుడ, బ్రహ్మాండపురాణాల్లో రామకథల అవసరం మేరకు అలరిస్తాయి. పంచమవేదంగా భాసిల్లుతోన్న మహాభారతంలో కూడా రామకథ ఉంది. పురాణేతిహాసాల తర్వాత చెప్పుకోదగిన రామాయణాలు అనేకం ఉన్నాయి. వాటిలో వాల్మీకి రామాయణంతో సరితూగేది అధ్యాత్మరామాయణం. మరొకటి ఆనంద రామాయణం. ఆధ్యాత్మ రామాయణంలో ఉన్నట్టుగానే ఆనంద రామాయణంలో కూడా శ్రీరామకథను పార్వతికి పరమశివుడు చెబుతాడు.

అధ్యాత్మ రామాయణాల్లోని ఈ కథాంశమే 'అధ్యాత్మ రామాయణములు – తులనాత్మక పరిశీలన'కు ఆధారంగా నిలిచింది. దీనిని డాక్టర్ చల్లా శ్రీరామచంద్రమూర్తి రచించారు. దేవదేవుడయిన శ్రీరాముని తత్త్వాన్ని **'ఆత్మానాం మానుషం మన్యే'** అని చెప్పి, రావణాది రాక్షసులకు శ్రీరాముడు మానవమాత్రుడన్న నమ్మకాన్ని వాల్మీకి కలిగించాడు. దీంతో శ్రీరామాదుల పరతత్వం తెరమరుగయింది. ఇది పదిమందికీ తెలియాలన్న తపనే ఆధ్యాత్మ రామాయణానికి తెరతీసింది. ఇది కూడా సప్తకాండలు, 65 సర్గలు, నాలుగువేలకు పైగా శ్లోకాలూ కలిగి ఉంది. దీనిని వ్యాసుడు రాసాడని, కాదు విశ్వామిత్రుడు రాశాడని అంటారు. ఆ వాద వివాదాలన్నీ ఈ తులనాత్మక పరిశీలన గ్రంథంలో ఉన్నాయి. పరిశోధనాంశాలు ఉత్సాహాన్ని కలిగిస్తాయనుకుంటే పాఠకులు దీనిని పాఠ్యగ్రంథంలా పఠించవచ్చు.

ఉత్తర భారతాన ప్రముఖమై, కర్ణాటాది రాష్ట్రాలలో పద్యకావ్యంగా ప్రచారమయిన ఆనంద రామాయణాన్ని తెలుగులో అందించాలన్న సంకల్పంతో బ్రహ్మశ్రీ సిద్ధాంతి శివశంకర శాస్త్రులు వారు ఆనంద రామాయణాన్ని మూడు సంపుటాలుగా వెలువరించారు. ప్రథమ సంపుటంలో ఆరు కాండలున్నాయి. ద్వితీయ సంపుటంలోని రాజ్యకాండలో శ్రీమదానందరామ సహస్ర నామాలున్నాయి. తృతీయ సంపుటంలో రాజ్యాధికాండలున్నాయి. అన్నీ తాత్పర్యార్థ వివరణలతో చక్కగా ఉన్నాయి. చదవగలిగితే నాటి శిష్ట వ్యావహారికం ఎటువంటిదో అర్థమవుతుంది.

రామాయణ కథలో బలం ఉన్నది.రచనలో లోకోత్తరమయిన శైలి ఉంది. కథనంలో టెక్నిక్ ఉందంటూ ఈ కావ్యాన్ని సరళ వాడుక భాషలో అంటే తెలుగు దినపత్రిక చదివే వారు ఆనందంగా చదువుకోగలిగేలా ఉప్పులూరి కామేశ్వరరావు గారు 'వాల్మీకి రామాయణము' రచించారు. మూలంలో ఉన్న కీలకమయిన ఘట్టాలను వదలకుండా, అనవసర ప్రస్తావనలు తేకుండా జాగ్రత్తపడి భాష విషయంలో, కథనం విషయంలో పాపులర్ రచయితలు యండమూరి వీరేంద్రనాథ్, వసుంధరల సహాయ సహకారాలందుకున్నారు. పై మూడు రామాయణాలనూ చదవగలిగితే శ్రీరామ కథలో ఉన్న తేడాలు, అందాలూ తెలియవస్తాయి.

– జగన్నాథశర్మ


*Compliments from*

**Sri Krishna Bhat**

*When you come to*
*Holy Pilgrimage Centre Tirupati & Tirumala*


**WOOD SIDE ANNEXE**

Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**
**HOTEL WOODSIDE**

E.Car Street, Tirupathi. Ph : 2284464

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225


## తండ్రి కన్నా కొడుకు నూరు సుగుణాలధికంగా కలిగి ఉండాలి!

**'పితుః శతగుణ పుత్రః!'** అన్నది శాస్త్రం. తండ్రికన్నా కుమారుడు నూరు గుణాలు (సద్గుణాలు) అధికంగా కలిగి ఉండాలన్నది శాస్త్రం. తండ్రికన్నా కొడుకూ, కొడుకుకన్నా మనుమడూ– యిలా యిలా భవిష్యత్సంతతి మంచి గుణాల్ని అలవరచుకుంటూంటే ప్రపంచంలో మంచి ఇంతకు మరింతలుగా పెరిగి స్వర్గధామం అవుతుందనేదే పెద్దల ఆశాభావం. దీనినే తండ్రి కన్నా తనయుడు గొప్పవాడు కావాలన్న ఆశాభావం పెద్దల్లో కలుగుతూంటుంది.



# శ్రీ ఇప్పగుంట యశోదా కృష్ణారావు

శ్రీ ఇప్పగుంట యశోదా కృష్ణారావు IAS తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారిగా ఉన్నప్పట్నుంచీ నాకు పరిచయం. నేనెందర్నో కార్య నిర్వహణాధికార్లను చూసాను. కానీ ఇప్పగుంట యశోదా కృష్ణారావు పనితీరే వేరు. ఆయన శృంగేరీ శారదాపీఠ భక్తులు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేసారు. ఏ పదవి నధిష్ఠించినా దానికి విధేయంగా, సంపూర్ణ అంకిత భావంతో పనిచేయడం ఆయన లక్షణం. రూలు నతిక్రమించి ఏ పనీ చేయరు.

ఏం తలంపుతో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు బ్రాహ్మణ కార్పొరేషన్ ప్రారంభించినపుడు యశోదా కృష్ణారావునే CEO గా నియమించారు. (మరల తొలగించారు. ఆ విషయం ప్రస్తుతం ఇక్కడ అనవసరం కాబట్టి విడిచిపెట్టేస్తున్నాను) చంద్రబాబు ఏ అధికారినీ పూర్తికాలం పనిచేయనీయరనేది ఇక్కడ చెప్పుకోవాలి. తిరుపతి తిరుమల దేవస్థానంలో ఎందరో కార్యనిర్వహణాధికారులు పూర్తికాలం పనిచేయకుం డానే బదలీలయ్యారు. అలాగే యశోదా కృష్ణారావు బదిలీ అయ్యారు కాబట్టి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అవసరం లేదు. కానీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పరచి దాని నిర్వహణా సంకలన పద్ధతులు రూపొందించక మునుపే తొలగించడం అన్యాయం.

ఆయన పేరు ఇప్పగుంట యశోధర రామకృష్ణారావు. తల్లిదండ్రుల పేర్లు : ఇప్పగుంట భుజంగరావు, జననం 20-5-1910 - మరణం 21-2-2004

శ్రీమతి సరస్వతి, జననం: 20-8-1920 మరణం: 27-9-2010.

తండ్రిగారు 1951 నుండి 1970 వరకు ప్రకాశం జిల్లా కొండేపి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. 1970లో వీరు పదవీ విరమణ చేశారు. వీరికి ఐదుమంది కుమారులు. ఒక కుమార్తె. మొదటివారు : మల్లికార్జునరావు (రిటైర్డ్ హెడ్‌మాస్టర్), జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కందుకూరు, ప్రకాశం జిల్లా. వీరు ఇటీవల రచనలు చేస్తున్నారు. ఇంగ్లీషు మరియు తెలుగులో ఆకాశవాణి, విజయవాడలో పలు కార్యక్రమాలు ప్రసారమయ్యాయి. ఇమ్మార్టల్స్ అను పేరుతో ఇటీవల ఎమెస్కో పబ్లికేషన్స్‌వారు ప్రచురించారు.

రెండవవారు : కన్యపరావు (రిటైర్డ్ హెడ్‌మాస్టర్), జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఇప్పగుంట, ప్రకాశం జిల్లా.

మూడవ కుమారుడు : యశోధర రామకృష్ణారావు, ఐ.ఏ.యస్. 2016- జనవరి 31వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యకార్యదర్శిగా పదవీ విరమణ చేశారు.

నాల్గవవారు : రావినూతన లక్ష్మీ, భర్త : రావినూతల రాధాకృష్ణ, హైదరాబాద్‌లోని డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేసారు.

ఐదవవారు : శ్రీకర్‌రావు, మీరట్‌లోని కార్పొరేషన్ బ్యాంకు జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

ఆరవవారు : జయకరరావు, హైదరబాద్‌లోని నేషనల్ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తున్నారు.

కృష్ణారావుగారి సంక్షిప్త పరిచయం : ప్రాథమిక, ఉన్నత విద్యను ప్రకాశం జిల్లాలోని కొండపి పాఠశాలలో చదివారు. ఇంటర్ కందుకూరులోని ఆర్.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాలలో చదివారు. బి.ఏ.డిగ్రీని కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కళాశాలో చదివారు. యం.ఏ, ఎకనామిక్స్ అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలో చదివారు. ఐ.ఏ.యస్. 1979లో సెలెక్ట్ అయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేసి మంచిపేరు సంపాదించారు. తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య కార్యదర్శిగా వీరు వీరి స్వగ్రామమైన ప్రకాశం జిల్లాలోని చవటపాలెంను దత్తతగా తీసుకుని గ్రామాన్ని అభివృద్ధి చేశారు. ఈ గ్రామంలోని శ్రీరామదేవాలయంను పునరుద్ధరించారు. వీరికి ఇరువురు సంతానం. కుమార్తె : స్రవంతి, యం.యస్, యు.యస్.ఏ.లో చేరారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కుమారుడు : కౌసిక్- యం.యస్. యు.యస్.ఏ.లో చేసి, యు.యస్.ఏ.లో పనిచేస్తున్నారు.

## కృష్ణారావు బ్రాహ్మణుల్లో రాజకీయ చైతన్యం రావాలంటారు

రాష్ట్రంలో బ్రాహ్మణుల సంఖ్య ఎక్కువగా ఉన్న రాజకీయ చైతన్యం లేక వెనుకబడ్డారని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ఐ.వై.ఆర్. కృష్ణారావు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాలోని తిరుమలనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంఘ సమావేశంలో ఆయన ప్రసంగించారు. అధికారం ఉంటే దేనినైనా సాధించుకోవచ్చు నని ఆయన పేర్కొన్నారు. బ్రాహ్మణులు, వైశ్యుల, ముస్లీములు లేని పట్టణమంటూ ఏదీ లేదన్నారు. ఈ మూడు వర్గాలు కలిస్తే రాజకీయంగా ఎంతో మార్పు వస్తుందని, ఒక్క త్రాటిపైకి వచ్చి రాష్ట్రంలో సీట్ల సాధనకు పార్టీల మీద ఒత్తిడి తీసుకురావా లన్నారు. ఆ వర్గాల కలయికతో వేదిక ఏర్పాటు చేస్తే తాను వచ్చేందుకు సిద్ధమన్నారు. అర్చకులు తమ సమస్యలను హక్కుగా భావించి పొందాలని పేర్కొన్నారు. ఆచార వ్యవహారాలతో మడికట్టుకుని కూర్చుంటే బ్రాహ్మణుల ఉనికే ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఓబుల్‌రెడ్డి, తహశీల్‌దార్ శ్రీనివాసరావు, బ్రాహ్మణ సంఘనాయకులు శ్రీకాంత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ●

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# ఆంధ్రుల చరిత్రను సప్రమాణంగా సమగ్రంగా వివరించిన కవివరేణ్యుడు కీ॥శే॥ చిలుకూరి వీరభద్రరావు!

ఆయనొక చరిత్రకారుడు రచయిత, గ్రంథ రచయిత, పత్రికా రచయిత. త్రివిధశాఖల్లో అత్యంత కృషి జరిపిన అమేయ ప్రతిభావంతుడు ఎంతో చరిత్రను అందించినవాడు. బహుముఖ ప్రజ్ఞావంతుడు. ఆయన 'దేశోపకారి' పత్రిక సహాయసంపాదకునిగా పత్రికారంగంలో కొన్నాళ్ళు కాలూనారు. ఏలూరులో పనిచేశారు. ప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడూ, చిత్రకారుడైన 'బాపు' గారి తాతగారైన సత్తిరాజు సీతారామయ్యగారి వద్ద 'దేశోపకారి' పత్రికలో సహాయసంపాదకునిగా పనిచేసారు. అనన్తరమ్ 1896 సంవత్సరములో 'విభుదరంజని' పత్రికా సంపాదకత్వం వహించారు. తదుపరి 1905 సం॥ములో రాజమహేంద్రవరమునకు మకాము మార్చారు. అక్కడ 'సత్యవాదిని' పత్రికను ప్రారంభించారు. చారిత్రక పరిశోధనా నిమిత్తం 1909 సం॥ములో మద్రాసు చేరుకున్నారు. కొమర్రాజు లక్ష్మణరావుగారి పరిచయంతో విజ్ఞానచంద్రికా గ్రంథమండలి తరఫున 'ఆంధ్రుల చరిత్ర' మొదటి రెండు భాగాలను ప్రచురించారు. ఆంధ్రదేశ చరిత్ర రచయితల్లో మొట్టమొదటి వరసులోని మొదటి రచయిత చిలుకూరి వీరభద్రరావు.

తెలుగుజాతి ఎంతో ప్రాచీనమైనదనీ, ఉత్తమ సంస్కృతీ సంపదల కాలవాలమనీ అట్టి ప్రాచీనౌన్నత్యాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రులలో కల్పించిన మహారచయిత చిలుకూరి వీరభద్రరావు. వారిని గురించి తెలుసుకున్నది నవంబర్ డిసెంబర్ 2017 'సుపథ' పత్రికలో తెలుసుకున్నది కొంత....

**చిలుకూరి వీరభద్రరావు**

ఆంధ్రుల చరిత్రను ప్రమాణాలతో అతి సమగ్రంగా గ్రంథస్థం చేయడానికి తన జీవితాంతం కృషిచేసిన మహా చారిత్రక పరిశోధకులు చిలుకూరి వీరభద్రరావుగారు (1872-1939). వీరు కొంతకాలం ఏలూరులో సత్తిరాజు సీతారామయ్య గారి (సినీ దర్శకుడు బాపు తాతగారు) 'దేశోపకారి' పత్రికకు సహాయ సంపాదకులుగా ఉన్నారు. 1896 సం॥లో 'విబుధరంజని' పత్రికకు సంపాదకత్వం వహించారు. 1905లో రాజమహేంద్రవరానికి వచ్చారు. అక్కడ 'సత్యవాదిని' పత్రికను నడిపారు. పరిశోధన నిమిత్తమై 1909 సం॥లో మద్రాసు చేరుకున్నారు. అక్కడ మరొక దిగ్గజం శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారితో పరిచయమై, వారితో కలిసి పనిచేసారు. 1910, 1912 సం॥లలో కొమర్రాజువారి సహాయసహకారాలతో వీరు ఆంధ్రుల చరిత్ర మొదటి రెండు భాగాలను 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి' తరఫున ప్రచురించారు. వీరు ఒక విధంగా ఆంధ్రదేశ చరిత్ర రచయితలలో మొట్టమొదటి వరుసలోనివారు. తెలుగుజాతి ఎంతో ప్రాచీనమైనదని, ఉత్తమ సభ్యత కలదనే స్పృహను, తిరిగి ఔన్నత్యాన్ని పొందాలనే తపనను ఆనాడు ఆంధ్రులలో కల్గించినవారు వీరభద్రరావుగారు. రాజమహేంద్రవరంలో మిత్రుల సహకారంతో 'ఇతిహాస తరంగిణీ గ్రంథమాల' స్థాపించి, ఆంధ్రుల చరిత్ర మూడవభాగాన్ని ప్రచురించారు. అయితే, తెలుగువారి సంపూర్ణ చరిత్రను 20 సంపుటాల్లో రచించాలనే వీరికి కోరిక తీరలేదు. చిలుకూరివారు 'రాజమహేంద్రవర పురచరితము', 'జీర్ణకర్ణాటక రాజ్యచరిత్రము' 'తిక్కన సోమయాజి' 'తిమ్మరుసు మంత్రి' 'శ్రీనాథకవి' 'శివాజీ చరిత్ర', 'కర్ణ సామ్రాజ్యము', 'నవరసిక మనోల్లాసిని', 'స్వయం సహాయం', 'వరలక్ష్మీ విలాసము', 'హిందూ సంసారము' 'హిందూ గృహము', 'హాస్యతరంగిణి', 'సుమిత్ర', 'అళియరామరాయలు' 'నాయకురాలి దర్పము', 'భారతవీరుల చరిత్ర' వంటి అనేక గ్రంథాలు రచించారు. 'చారిత్రక రత్న', 'ఆంధ్ర చతురానన' వీరి బిరుదులు.

**('సుపథ' సంపాదకులకు కృతజ్ఞతలు)**

## ఆహా ఏమి రాశావయ్యా!!!!! ఏమి స్వామి నీ మహిమ?

శ్రీశైల మల్లన్నను పాల్కురికి సోమన్న అచ్చులు, హల్లులతో ఎలా స్తుతించాడో చూడండి.

'అ'ఖిల లోకాధార
'ఆ'నంద పూర
'ఇ'న చంద్ర శిఖి నేత్ర
'ఈ'డితామల గాత్ర
'ఉ'రు లింగ నిజరూప
'ఊ'ర్జితా జలచాప
'[illegible]'లిత తాండవకాండ
'[illegible]'నికృతా జాండ
'ఏ'కైక వర్యేశ
'ఐ'క్య సౌఖ్యా వేశ
'ఓం' కార దివ్యాంగ
'ఔ'న్నత్య గుణ సంగ
'అం'బికా హృదయేశ
'అః'స్తోక కలనాశ

'క'నద హీనాభరణ
'ఖ'ల జలంధర హరణ
'గ'ల నాయక విధేయ
'ఘ'న భక్తి విజేయ
'జ'శ్చాల కాలధర
'చ'రిత త్రిశూల ధర
'ఛ'ర్మ యాధ్వస్త
''న గుణ ధళ ధీర
'ట' త్రయాది విదూర
'ఠ' ప్రభావాకార
'డ'మరుకాది విహార
'ఢ' వ్రాత పరిహార
'ణ' ప్రవాగార
'త'త్త్వ జోనేత
'థ'వి దూర జవ పక్ష
'ద'వన పాలన దీక్ష
'ధ'రణీ ధవోల్లీడ
'నంది కేశారూఢ
'ప'ర్వతీశ్వర లింగ
'బ'హుళ భూత విలాస
'భ'క్త్య హృద్వ నహన
'మం'త్రస్తుతోధార
'య'క్ష రుద్రాకార
'ర'తిరాజ బిన హంస
'ల'లిత గంగోత్తంస
'ళ'మా విదద్రంశ
'వ'రద శైల విహార
'శ'ర సంభ వాస్ఫార
'ష'ట్త్రింశ తత్త్వగత
'స'కల సురముని వినుత
'హ'రి నేత్ర పదపద్మ-
అంశిత భూధరపద్మ
'క్ష'ర రహిత చరిత్ర -
అక్షరాంక స్తోత్ర
శ్రీ పర్వత లింగ
నమస్తే నమస్తే నమస్తే నమః

# అష్టావక్రుడు

సకల విద్యావంతుడైన ఏకపాదునకు, సుజాతకు జన్మించిన వాడే అష్టావక్రుడు. ఏకపాదుడు గురుకులాన్ని నడుపుతూ, విద్యార్థులకు వేదవిద్య బోధించేవాడు. అయితే, విద్య బోధించే విషయంలో చాలా కఠినంగా ఉండేవాడు. ఈ విషయంలో నిద్రాహారాలు కూడా లెక్కచేసేవాడు కాదు. ఏకపాదునకు వివాహమై చాలాకాలం వరకూ సంతానం కలుగలేదు. ఎన్నో నోముల ఫలితంగా సుజాత గర్భవతి అయింది. ఏకపాదుని ఆనందానికి అవధులు లేవు. సుజాతకు నెలలు నిండుతున్నాయి.



ఒకరోజు ఏకపాదుడు నిద్రాహారాలు కూడా లెక్కచేయకుండా తన శిష్యులచేత వేదాధ్యయనం చేయిస్తున్నాడు. విద్యార్థులు అలసిపోతున్నారు... అయినా గురువుకు భయపడి వేదాన్ని అభ్యసిస్తూనే ఉన్నారు. ఇది సుజాత గర్భంలో పెరుగుతున్న శిశువుకు బాధాకరంగా తోచింది. వెంటనే తన తండ్రితో 'తండ్రీ.., ఏమిటీ విద్యాబోధన? శిష్యులు నిద్రాహారాలు లేక సొలసిపోతున్నారు. వారి ఆరోగ్యం పాడవుతోంది. ఈ విధమైన విద్యావిధానాన్ని మార్చుకో' అని గర్భంలోంచే సలహా ఇచ్చాడు. 'తనకు పుట్టబోయే కుమారుడు.., తనకు సలహాయిచ్చేంత గొప్పవాడా' అని ఏకపాదుడు అహంకరించి, ఆ గర్భస్థ శిశువును ఉద్దేశించి.. 'నీ జన్మకు కారణభూతుడనైన తండ్రినే విమర్శించేంత ఘనుడవా నీవు? వేదాధ్యయనమునకు వక్రముగా గురువునే విమర్శించిన పాపానికి ప్రతిఫలంగా నీవు 'అష్టావక్రుడు'గా జన్మించు' అని కోపంగా శపించాడు. ఆ గర్భస్థ శిశువు తన తండ్రి శాపాన్ని ఆనందంగా స్వీకరించాడు.

సుజాతకు తొమ్మిది నెలలు నిండాయి. ప్రసవ సమయం దగ్గర పడిందని., ఇక రెండు మూడు రోజులలో శిశు జననం జరుగుతుందని గ్రహించాడు ఏకపాదుడు. ప్రసవ సమయానికి అవసరమైన తిలలు, ఘృతము, ఇతర ధాన్యములు సంపాదించే నిమిత్తం ఏకపాదుడు జనకుని రాజ్యానికి వెళ్ళాడు. అక్కడ అనుకోని విధంగా వరుణుని కుమారుడైన వందితో వాదానికి దిగి ఓడిపోయాడు. పోటీ నియమానుసారం వంది.., ఏకపాదుని జలమధ్యంలో బంధించాడు. సరిగ్గా ఆ సమయంలోనే సుజాత., తన అన్న అయిన ఉద్దాలకుని ఇంట ఒక మగ శిశువును ప్రసవించింది. అయితే తండ్రి శాపానుసారం ఎనిమిది వంకరలు గల దేహంతో జన్మించాడు. అందుచేతనే అతనికి 'అష్టావక్రుడు' అని పేరు వచ్చింది.

ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతునకు, అష్టావక్రునకు సమంగా వేదవిద్య నేర్పుతున్నాడు. ఒకరోజు అష్టావక్రుడు తన మేనమామ అయిన ఉద్దాలకుని తొడపైన కూర్చున్నాడు. అది చూసిన శ్వేతకేతువు గబగబా వచ్చి 'నా తండ్రి తొడ మీద నేను కూర్చోవాలిగానీ., నువ్వెలా కూర్చుంటావు? వెళ్లి నీ తండ్రి తొడమీద కూర్చో.' అని ఘర్షణకు దిగాడు. వెంటనే అష్టావక్రుడు తన తల్లి దగ్గరకు వెళ్లి ' అమ్మా..నా తండ్రి ఎక్కడ అని అడిగాడు'. ధన సంపాదనకై జనకుని సభకు వెళ్లారని చెప్పింది సుజాత. వెంటనే అష్టావక్రుడు జనకుని సభకు వెళ్లి., జరిగిన సంగతి తెలుసుకుని తన వాదనతో వందిని ఓడించి, తన తండ్రితో పాటు, గతంలో ఓడి బంధింపబడిన వారినందరినీ కూడా జలమధ్యం నుంచి విడిపించాడు. ఆ తర్వాత తన తండ్రిని తల్లికి అప్పగించి, తల్లికి ఆనందం కలిగించాడు.

అష్టావక్రునకు యుక్తవయస్సు వచ్చింది. వివాహం చేసుకో దలచి వదాన్యుని దగ్గరకు వెళ్లి అతని కుమార్తె అయిన 'సుప్రభ'ను తనకు కన్యాదానంగా ఇమ్మని అర్థించాడు. వదాన్యుడు అతని శక్తిని పరీక్షింపగోరి 'నీవు ఉత్తరదిశగా వెళ్లి, కుబేరుని పట్టణం దాటి, కైలాసగిరి చేరి, శివపార్వతులు సంచరించిన ప్రదేశం దాటి ముందుకు వెడితే ఒక స్త్రీ కనిపిస్తుంది. ఆమెను చూసి రా..అప్పుడు నా కుమార్తె 'సుప్రభ' నీకిచ్చి వివాహం జరిపిస్తాను' అని పలికాడు.

అష్టావక్రుడు ఉత్తరదిశగా బయలుదేరాడు. ముందుగా కుబేర పట్టణం చేరాడు. కుబేరుడు అతనికి స్వాగతం పలికాడు. అష్టావక్రుడు, కుబేరుని ఇంట రంభ, ఊర్వసి, తిలోత్తమల నృత్యగానాలను ఆస్వాదిస్తూ ఒక సంవత్సరం అతిథిగా కాలం గడిపి, తిరిగి తన ప్రయాణం కొనసాగించి.. హిమాలయాలలో బంగారుమయమైన ఒక దివ్యభవనాన్ని చూసాడు. అక్కడ కొందరు సుందరీమణులు అష్టావక్రునకు స్వాగత మర్యాదలు జరిపి ఆ భవనంలోకి తీసుకుని వెళ్లారు. ఆ భవనంలోపల ఒక జగన్మోహిని చిరునవ్వుతో అష్టవక్రుని దగ్గకు వచ్చి ప్రేమగా అతనిని తన అభ్యంతర మందిరానికి తీసుకుని వెళ్లి, తన కోరిక తీర్చమని అర్థించింది. 'తల్లీ.. నేను అస్ఖలిత బ్రహ్మచారిని. పరసతిని కూడుట ధర్మం కాదు. నన్ను విడిచిపెట్టు' అని అర్థించాడు. 'ఈ రాత్రికి మా ఆతిథ్యం స్వీకరించి వెళ్లండి' అని కోరింది ఆ సుందరి.

అంగీకరించాడు అష్టావక్రుడు. తెల్లారింది. అష్టావక్రుడు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. అప్పుడా జగన్మోహిని అతని దగ్గకు వచ్చి ' మహాత్మా... పరసతిని అనే కదా మీ అభ్యంతరం. నన్ను వివాహం చేసుకోండి. మీ సతిని అవుతాను. కాదనవద్దు.' అని అర్థించింది. 'అమ్మా...నీవు బాలవు. నీ వివాహ విషయంలో నీ తండ్రిగానీ, సోదరుడుగానీ నిర్ణయం తీసుకోవాలిగానీ.. నీకుగా నీవు స్వతంత్రించి నిర్ణయం తీసుకునే అధికారం నీకు లేదు. నిజం చెప్పు. నువ్వెవరు?' అని ప్రశ్నించాడు అష్టవక్రుడు. ఆమె అతని దర్మనిష్ఠకు సంతసించి 'మహామునీ..నేను ఉత్తరదిక్కాంతను. మిమ్ములను పరీక్షింపమని వదాన్యుడు నన్ను పంపాడు. ఈ పరీక్షలో విజయాన్ని వరించారు. వెళ్లి సుప్రభను వివాహం చేసుకోండి.' అని పలికింది. ఆ తర్వాత సుప్రభ, అష్టావక్రుల వివాహం ఘనంగా జరిగింది. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

### ప్రాచీన ప్రదేశాలు - ఆధునిక నామధేయాలు

# భాగవతం, మహాభారతం

1. మహావిష్ణువు గజేంద్రున్ని మొసలి బారి నుంచి రక్షించిన స్థలం – దేవ్ ధాం, నేపాల్.
2. నృసింహస్వామి హిరణ్యకశిపుని వధించిన స్థలం – అహోబిలం, ఆంధ్రప్రదేశ్.
3. జమదగ్ని మహర్షి ఆశ్రమం – జమానియా, ఉత్తర్ ప్రదేశ్.
4. మహిష్మతి (కార్తవీర్యార్జునుని రాజధాని) –మహేశ్వర్, మధ్యప్రదేశ్
5. శమంత పంచకం (పరశురాముడు ఇరవైయొక్క మార్లు క్షత్రియులపై దండెత్తి వారి రక్తంతో 5 మడుగులు నెలకొల్పిన చోటు) మరియు దుర్యోధనుని చంపిన చోటు–కురుక్షేత్ర, హర్యానా
6. పరశురామక్షేత్రం (పరశురాముడు తన గొడ్డలిని సముద్రంలోకి విసిరి, సముద్రజలాలను వెనక్కి పంపి తనకోసం నేలను సృష్టించుకొన్న ప్రాంతం) – కేరళ, కర్నాటక, మహారాష్ట్ర సముద్రతీర ప్రాంతం
7. మహేంద్ర పర్వతం (పరశురాముడు తపస్సు చేసిన స్థలం) – పశ్చిమ ఒరిస్సా
8. నిషాద రాజ్యం (నల మహారాజు రాజ్యం) – గ్వాలియర్ జిల్లా,మధ్యప్రదేశ్
9. వ్యాస మహర్షి పుట్టిన స్థలం– ధమౌలి, నేపాల్
10. నైమిశారణ్యం (వ్యాస మహర్షి తన శిష్యులకు వేదాలు,పురాణాలు బోధించిన ప్రాంతం) – సీతాపూర్ జిల్లా, ఉత్తర్ ప్రదేశ్
11. వ్యాస మహర్షి చెబుతుండగా, విఘ్నేశ్వరుడు మహాభారతం వ్రాసిన చోటు– మన గ్రామం, ఉత్తరాంచల్
12. ప్రతిష్ఠానపురం (పురూరవుని రాజధాని) –ఝున్సి,అలహాబాద్.
13. సాళ్వ రాజ్యం(సావిత్రీ,సత్యవంతుల కథలో సత్యవంతుని రాజ్యం)–కురుక్షేత్ర దగ్గర.
14. హస్తినాపురం (కౌరవుల రాజధాని) – హస్తినాపూర్, ఉత్తర్ ప్రదేశ్.
15. మధుపురం / మధువనం (కంసుని రాజధాని) –మధుర, ఉత్తర్ ప్రదేశ్.
16. వ్రేపల్లె / గోకులం – గోకుల్, మధుర దగ్గర.
17. కుంతిపురి (పాండురాజు మొదటి భార్య కుంతిదేవి పుట్టినిల్లు) – గ్వాలియర్.
18. మద్ర దేశం (పాండురాజు రెండో భార్య మాద్రి పుట్టినిల్లు) – పంజాబ్ ప్రావిన్స్, పాకిస్తాన్.
19. ద్రోణనగరి (ద్రోణుడు నివసించిన ప్రాంతం)–డెహ్రాడూన్.
20. గురుగ్రామం (కురుపాండవులు విద్యాభ్యాసం చేసిన చోటు) – గురుగావ్, హర్యానా.
21. కర్ణుడు పరిపాలించిన అంగ రాజ్యం – కాబుల్ (ఆఫ్ఘనిస్తాన్).
22. పాండవుల లాక్షగృహ దహనం– వర్నాల్, హస్తినాపూర్.
23. కాలయవనుడు ముచికుందుని కోపాగ్ని జ్వాలలకు భస్మమైన స్థలం – గిర్నార్, గుజరాత్.
24. శ్రీకృష్ణ, బలరాముల ద్వారకా నగరం – ద్వారక,గుజరాత్.
25. హిడింబవనం (హిడింబాసురుడిని భీముడు చంపిన చోటు) –జలాన్ జిల్లా, ఉత్తర్ ప్రదేశ్.
26. విదర్భ (దమయంతి, రుక్మిణీదేవి తండ్రులు యేలిన రాజ్యం) – విదర్భ, మహారాష్ట్ర
27. కుండినపుర (రుక్మిణిదేవి జన్మస్థలం) – కుండినపుర, మహారాష్ట్ర
28. చేది రాజ్యం (శిశుపాలుడు ఏలిన రాజ్యం) – బుందేల్ ఖండ్, మధ్యప్రదేశ్.
29. కారుష రాజ్యం (దంతవక్రుడు ఏలిన రాజ్యం) – దాతియ జిల్లా, మధ్యప్రదేశ్.
30. ఖాండవప్రస్థం / ఇంద్రప్రస్థం (పాండవుల రాజధాని) – ఇంద్రప్రస్థ, ఢిల్లీ దగ్గర.
31. కుచేలుడు నివసించిన చోటు – పోర్ బందర్, గుజరాత్.
32. పాంచాల దేశం (ద్రుపద మహారాజు రాజ్యం) – ఎటాహ్, సహజహంపూర్, ఫారుఖాబాద్ ప్రాంతాలు, ఉత్తర్ ప్రదేశ్.
33. కంప్లి (ద్రౌపది పుట్టినిల్లు,మత్స్యయంత్ర బేధన స్థలం) – కంపిల్, ఉత్తర్.
34. జరాసంధుని భీముడు చంపిన చోటు – జరాసంధ్ కీ అఖరా / రణ్ భూమి, బీహార్.
35. కామ్యక వనం,దైత్య వనం (పాండవులు అరణ్య వాసం చేసిన ప్రాంతాలు) – పశ్చిమ హర్యానా.
36. మత్స్య దేశం (విరాట మహారాజు రాజ్యం) –ఆల్వార్,గురుగావ్ నుంచి జైపూర్ వరకు వున్న ప్రాంతం, రాజస్థాన్.
37. విరాటనగరం (పాండవులు అజ్ఞాత వాసం చేసిన స్థలం) – విరాట్ నగర్,రాజస్థాన్
38. శోణపురం (బాణాసురుడి రాజధాని) – సోనిత్ పూర్, అస్సాం.
39. ప్రాగ్జ్యోతిష్యం (నరకాసురుని రాజధాని) – తేజ్ పూర్, అస్సాం.
40. నిర్యాణానికి ముందు శ్రీకృష్ణుడు బోయవాని వేటుకి గురైన స్థలం – ప్రభాస తీర్థం, సోంనాథ్, గుజరాత్.
41. జనమేజయుడు సర్పయాగం చేసిన స్థలం – పరాం, ఉత్తరప్రదేశ్.
42. కపిలవస్తు (బుద్ధుని జన్మస్థలం)– నేపాల్ లోని తిలార్కోట్.
43. బుద్ధునికి జ్ఞానోదయం అయిన స్థలం– బోధ్ గయ, బీహార్.
44. గౌతమ బుద్ధుడు పరినిర్యాణం చెందిన చోటు– కుశీనగర్, ఉత్తర్ ప్రదేశ్.

### ప్రాచీన ప్రదేశాలు - ఆధునిక నామధేయాలు

# రామాయణం

1. భగీరథుడు గంగను భువికి దింపిన స్థలం – గంగోత్రి, ఉత్తరాఖండ్
2. కపిల మహర్షి ఆశ్రమం,(శ్రీరాముని పూర్వీకులు సగర చక్రవర్తి తనయులు 60,000 మంది కాలి బూడిదైన స్థలం.గంగానది వారి భస్మరాసుల మీద ప్రవహించి వారికి పుణ్యలోకాలు ప్రసాదించి బంగాళాఖాతంలో కలుస్తుంది) – గంగాసాగర్, వెస్ట్ బెంగాల్
3. కాంభోజ రాజ్యం – ఇరాన్ ( శ్రీరాముని ముత్తాత రఘు మహారాజు సామ్రాజ్యం ఉజ్బెకిస్తాన్, తజకిస్తాన్, కజఖిస్తాన్, దాటి యింతవరకూ విస్తరించింది).
4. రక్షస్థలం (రావణుడు తన పది తలలు నరికి శివున్ని పూజించి వరాలు పొందిన చోటు)– లాంగకో, టిబెట్, చైనా
5. పరమశివుని ఆత్మలింగాన్ని గణేశుడు నేలవైచిన చోటు – గోకర్ణ, కర్ణాటక
6. సీతాదేవి భూమిలో లభించిన చోటు – సీతామరి, బీహార్
7. మిథిల (సీతాదేవి పుట్టినిల్లు) – జనక్ పూర్, నేపాల్
8. కోసలదేశం – రాజధాని అయిన అయోధ్య నుండి నేపాల్ లోని కొన్ని ప్రాంతాల వరకు ఉన్న ప్రదేశం
9. దశరథుడు పుత్రకామేష్ఠి యాగం చేసిన స్థలం – ఫైజాబాద్,ఉత్తర్ ప్రదేశ్.
10. సరయూ నది (ఈ నదీ తీరంలోనే అయోధ్య నిర్మితమైనది) – ఘాఘర నది.
11. ఆయోధ్య / సాకేతపురం (శ్రీరాముని జన్మస్థలం, బంగారు సీతతో అశ్వమేధ యాగం చేసిన స్థలం, సరయూ నదిలో మునిగి వైకుంఠం చేరిన స్థలం) – అయోధ్య, ఉత్తర్ ప్రదేశ్.
12. తాటక వధ జరిగిన ప్రదేశం – బక్సర్, బీహార్
13. అహల్య శాపవిమోచన స్థలం – అహిరౌలి,బీహార్
14. కుశనాథపురం (విశ్వామిత్రుడు యాగం చేసిన స్థలం) – సుల్తాన్ పూర్, ఉత్తర్ ప్రదేశ్
15. గుహుడు సీతారామలక్ష్మణులను కలిసిన చోటు – శృంగబేరిపురం, అలహాబాద్ దగ్గర
16. దండకారణ్యం – చత్తీస్ ఘడ్ లోని బస్తర్ జిల్లా, ఆంధ్ర, ఒరిస్సా, మధ్యప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాలు.
17. చిత్రకూటం (సీతారామలక్ష్మణులు వనవాసం చెసిన చోటు) – సాత్న జిల్లా, మధ్యప్రదేశ్.
18. పంచవటి (శూర్పణఖ ముక్కుచెవులు కోసిన స్థలం) – నాసిక్, మహారాష్ట్ర.
19. కబంధాశ్రమం – కర్దిగుడ్, బెల్గావి, కర్ణాటక.
20. శబరి ఆశ్రమం – సర్బన్, బెల్గావి, కర్ణాటక.

# మహాభారతం నుండి నేర్చుకోవాల్సినవి

## 1. జీవితంలో గెలవడానికి జాలి, దయ, మంచితనం మాత్రమే ఉంటే చాలదు:

కర్ణుడు అంటేనే మంచితనానికి, దాన, ధర్మలకి పెట్టింది పేరు, కాని సమయాన్ని బట్టి నడుచుకోక పోవడం వలన చెడు (కౌరవుల) వైపు నిలబడి ప్రాణాలని పోగొట్టుకున్నాడు, కావున జీవితంలో గెలవాలంటే మంచితనంతో పాటు చుట్టూ ఉండే సమాజ పరిస్థితులని, సమయాన్ని బట్టి నడుచుకోవాలి.

## 2.చెడు స్నేహం ఊహాలకి కూడా అందని విధంగా మీ జీవితం నాశనం చేయొచ్చు:

శకుని..పరోక్షంగా కౌరవ సామ్రాజ్యం మొత్తాన్ని నాశనం చేసి,వారితో స్నేహంగా వారి ఆస్థానంలో ఉంటూనే వారికి కలలో కూడా ఊహించని పరాజయాన్ని మిగిల్చాడు,జీవితంలో శకుని లాంటి వారి సలహాలని దూరం పెట్టాలి.

## 3. ఎటువంటి బేధాలు చూడని నిజమైన స్నేహం జీవితంలో ఉన్నత స్థానానికి తీసుకెళ్తుంది...

పాండవులు శ్రీ కృష్ణుడిని ,కౌరవులు కర్ణుడిని పొందటం అది వారికి యుద్ధం సమయంలో ఏ స్థాయిలో ఉపయోగపడిందో తెలిసినదే ,కర్ణుడి లేని రారాజు బలం ఏ పాటిదో ,కౌరవ సేనకు కర్ణుడు ఏ స్థాయి ధైర్యమో తెలిసిన సంగతే కదా, కుల,మత, పేద మరియు ధనిక భేదాలని చూడకుండా మంచివారితో స్నేహం చేసేవారు ఖచ్చితంగా జీవితంలో గెలుస్తారు.

## 4.అధికం అనేది అత్యంత ప్రమాదకరం:

కౌరవుల తల్లి అయిన గాంధారీ కి వంద మంది కుమారులు ఉండటం వల్ల వారిని పెంచటంలో చాలా కష్టపడాల్సి వచ్చింది, ,రాజ్యాన్ని బిడ్డలకి సమంగా పంచటమూ వారి బాగోగులు చూస్తూ క్రమశిక్షణతో పెంచటమూ కూడా చాలా కష్టం, అలాగే దుర్యోధనుడికి ఉన్న అధికమైన కోపం, అధికమైన రాజ్యకాంక్ష కారణంగా కౌరవులు నాశనం అయ్యారు..! కాబట్టి అన్ని చోట్ల ముఖ్యంగా చెడు పక్షాన అధికం అనేది అత్యంత ప్రమాదకరం.

## 5. ఎవరి పనులు వారే చేసుకోవడం:

అరణ్య వాసం, అజ్ఞాతవాసంలోఉన్న పాండవులకి వాళ్ళు నేర్చుకున్న ఇంటి పనులు, వంట పనులు చాలా ఉపయోగపడ్డాయి, అలాగే మనం కూడా మన అవసరాల కోసం అయినా కొన్ని పనులు నేర్చుకోవాలి.

## 6.మనకి సంబంధించిన దాని కోసం ఎంత కష్టమైన పోరాడాలి:

కౌరవులతో పోల్చుకుంటే పాండవుల సైన్యం చాలా తక్కువగా ఉన్న పాండవులు తమ కష్టాన్ని మాత్రమే నమ్ముకొని చిత్తశుద్ధితో పోరాటం చేసి విజేతలుగా నిలిచారు

## 7. అతి ప్రేమ నష్టం కలిగిస్తుంది:

ధృతరాష్ట్రుడు అటు బిడ్డల మీద ప్రేమ ఇటు తను నమ్ముకున్న సిద్ధాంతాల మధ్య ఎలా నలిగిపోయాడో ,కొడుకుల వినాశనం అంతా తెలుస్తున్నా వారి తప్పులని ఆపలేకపోయాడు ,అదే ధృతరాష్ట్రుడు తన బిడ్డల మీద అంత ప్రేమని పెంచుకోక వారిని క్రమశిక్షణలో పెట్టి ఉంటే విషయం అంత వరకూ వెళ్ళేది కాదేమో. ఎవరి మీద అయిన అతి ప్రేమ, అతి నమ్మకం నాశనానికి, మోసానికి దారితీస్తాయి.

## 8. విద్య జీవితాంతం నేర్చుకోవటమే మీకు ఉత్తమ బహుమతి:

అర్జునుడు తన జీవిత ఆసాంతం విద్యలు నేర్చుకుంటూనే ఉన్నాడు .ద్రోణా చార్యుల వారి నుండీ యుద్ధ శాస్త్రం, దైవ సంబంధమైన ఆయుధాల వాడకం ఇంద్రుడు ద్వారా ,మహాదేవుడి నుండి పాశుపతాస్త్రం, యుధిష్టరుడు, కృష్ణుడి నుండి మరెన్నో రాజ నీతులు ఇలా ప్రతి దశలోనూ అభ్యసించటమే అర్జునుడికి ఓ ప్రత్యేక స్థానం దక్కింది, నిత్యం నేర్చుకోవడం వలన ఖచ్చితంగా విజయం సాధించవచ్చు.

## 9.కొన్నిసార్లు శత్రువులు కూడా మిత్రుల రూపంలో ఎదురవుతారు:

కౌరవుల పక్షాన ఎంతో మంది ఉన్నా వాస్తవానికి వారిలో చాలా మంది పాండవులకి సహాయపడ్డ వాళ్ళే, భీష్మ, విదుర, ద్రోణ రహస్యంగా పాండవులకి ఎంత సహాయం చేసారో తెలిసినదే, ఇక విదురుడు అయితే కౌరవుల ప్రతీ అడుగు పాండవులకి మోసుకొచ్చిన వాడు కదా.

## 10.స్త్రీలని ఆపదల నుండి కాపాడటం :

నిజానికి ద్రౌపది ఐదుగురు భర్తలూ సంపన్నులూ,అత్యంత బలవంతులు కూడా– కానీ సభామందిరాన అవమానం ఆపలేకపోవటంలో విఫలమయ్యారు కదా.

## 11. అర్ధ జ్ఞానం అత్యంత ప్రమాదకరం:

పద్మవ్యూహం లోనికే ప్రవేశించటమే కానీ బయటపడటం తెలియక తనకున్న అర్ధ జ్ఞానంతో అభిమన్యుడు వంటి మహావీరుడే నేల రాలిపోయాడు. ఏ పనిని అయిన పూర్తిగా తెలుసుకున్నాకే మొదలుపెట్టాలి, అలా తెలుసుకోకపోతే ఆ పనిని మధ్యలోనే వదిలేయాల్సిన పరిస్థితి వస్తుంది.

## 12. ఆడది తలుచుకుంటే ఏమైనా చేస్తుంది

కేవలం ద్రౌపదికి జరిగిన అవమానం వలన, ఆమె కౌరవ సామ్రాజ్యం మీద పెంచుకున్న కోపం చివరికి కౌరవులని వాళ్ళ సామ్రాజ్యాన్ని నామ రూపాలు లేకుండా చేసింది.

## 13. నీకు ఆసక్తి ఉంటే నిన్ను ఎవ్వరూ ఆపలేరు:

చాలా మందికి తెలిసినంత వరకూ అర్జునుడే ప్రపంచం మొత్తంలో అతిపెద్ద విలుకాడు, కానీ కుటిల రాజకీయాల వలన తన వేలుని కోల్పోయిన ఏకలవ్యుడు, అర్జునుడిని మించిన వీరుడు నేరుగా గురు శిక్షణ లేకున్నా ,అతనికి ఉన్న ఆసక్తే అర్జునుడి కన్నా గొప్ప వీరుణ్ణి చేసింది. కావున ఏదైనా సాధించాలంటే ముందుగా మనకు దాని పైన అమితమైన ఆసక్తి ఉండాలి లేకపోతే సాధించలేము.

## 14.మంచి వ్యూహం విజయానికి తప్పనిసరి:

పాండవులకే కనుక కృష్ణుడి అతిచక్కని వ్యూహం లేకపోయి ఉంటే పాండవులు విజయాన్ని సాధించగలిగేవారు కాదు ఏమో, ఏ పని చెయ్యాలన్న ఒక మంచి ప్రణాళిక (వ్యూహం) ఉండాలి అలా అయితేనే ఆ పనిని సక్రమంగా పూర్తి చేయగలుగుతాం.

---

21. హనుమంతుడు రామలక్ష్మణులను మొదటిసారి గా కలసిన ప్రదేశం – హనుమాన్ హళ్ళి, కొప్పాళ, కర్ణాటక.
22. ఆంజనేయ పర్వతం (హనుమంతుడి జన్మస్థలం), కిష్కింద (సుగ్రీవుని రాజ్యం), ఋష్యమూక పర్వతం –తుంగభద్ర నదీతీర ప్రాంతం, హంపి దగ్గర,కర్ణాటక
23. విభీషణుడు రాముని శరణు కోరిన స్థలం – ధనుష్కోటి, తమిళనాడు.
24. శ్రీరాముడు వానరసైన్యం తో వారధి నిర్మించిన చోటు– రామేశ్వరం,తమిళనాడు
25. రత్నద్వీపం / సింహళం / లంక – శ్రీలంక.
26. అశోకవనం (సీతాదేవి బందీగా ఉన్న ప్రదేశం) – కాండీ దారిలోని సీత ఏళియ, శ్రీలంక
27. శ్రీరాముడు రావణుని వధించిన చోటు – దునువిల్ల, శ్రీలంక
28. సీతాదేవి అగ్నిప్రవేశం చేసిన ప్రాంతం – దివిరుంపోల, శ్రీలంక.
29. వాల్మీకి ఆశ్రమం / సీతాదేవి కుశలవులకు జన్మనిచ్చిన స్థలం / భూదేవిలో ఐక్యమైన స్థలం – ఉత్తర్ ప్రదేశ్ లోని కాన్పూర్ నుంచి 30 మైళ్ళ దూరంలోని బితూర్.
30. కుశపురం (సీతారాముల పెద్ద కుమారుడు కుశుడు కట్టించిన నగరం) – కుశార్, పాకిస్తాన్.
31. లవపురం (సీతారాముల చిన్న కుమారుడు లవుడు కట్టించిన నగరం) – లాహోర్, పాకిస్తాన్
32. తక్షశిల (శ్రీరాముని తమ్ముడైన భరతుని పెద్దకొడుకు తక్షుడు నిర్మించిన నగరం) – తక్షశిల, పాకిస్తాన్
33. పుష్కలావతి / పురుషపురం (శ్రీరాముని తమ్ముడైన భరతుని రెండవ కొడుకు పుష్కరుడు నిర్మించిన నగరం) – పెషావర్, పాకిస్తాన్. – వాట్సప్ సేకరణ

# దశరథరామిరెడ్డి లేరను వార్తను జీర్ణించుకోలేకపోతున్నాను!



ఒకటా, రెండా, మూడు దశాబ్దాల అనుబంధం, ఆత్మీయ బంధం, అనురాగబంధం మామధ్య పెనవేసుకుని ఉన్నది. మద్రాసు నగరంలో ఈ చివర అశోక్‌నగర్‌లో నేనూ, ఆ చివర పెరంబూరులో ఆయన ఉంటున్నప్పటికినీ దూరాన్ని బంధం మ్రింగివేసింది. నేనన్నా, మా పెద్దబ్బాయి వేంకటేశ్వరరావు అన్నా ఆయనకెంతో ప్రాణం. ఓ చిన్న విజిటింగ్ కార్డును పనిగా చేసుకుని ఆయన రామ్‌రాజ్ ప్రింటర్స్‌కు రాని వారం ఉండేది కాదు. ఆయన వచ్చేటప్పుడు పదిమంది తెలుగువాళ్ళు వస్తూండేవారు. వాళ్ళు దివాన్ బహద్దూర్ కలవలకణ్ణన్ చెట్టి విద్యాసంస్థల్లో చదువుకునేవారే కావచ్చు. ఆయన వెనకాల దండుగా వచ్చేవారు.

నా భార్య సజీవిగా ఉన్నప్పుడు, ఆయన ఇంటికి వచ్చి, నా శ్రీమతిని పలుకరించి వెళ్ళేవారు. ఏ సభలకూ రాని నా శ్రీమతిని ఆర్.బి.సి.సి విద్యాసంస్థలో జరిగిన సత్కార సభలో పాల్గొనేట్లు చేసారు. మా ఇంటిలో మా ప్రెస్ సిబ్బందిలో వారు అనుబంధం బాగా పెంచుకున్నారు. నా జీవితంలో ఇంతింతగా స్పందింపచేసిన వ్యక్తి, పరవశింపచేసిన వ్యక్తి మరొకరు లేరు. మద్రాసులో ఏ సాహితీ సమావేశం జరిగినా, పదిమందిని వెంటపెట్టుకుని వచ్చే స్వభావాన్ని ఒక్క దశరథరామిరెడ్డిలోనే చూశాను.

ఆయన కుమారుడొకరు లండన్‌లో ఉండడం మూలకంగా ఆయన లండన్ వెళ్ళి, అక్కడి తెలుగువారిని స్పందింపచేస్తూ, 'షైనింగ్ స్టార్' బిరుదము పొందడం ఆయనకే దక్కింది. ఆ షైనింగు స్టార్ బిరుదమును జ్ఞాపకం చేసినప్పుడల్లా ఆయన ఎంతగానో మురిసిపోయేవారు. అప్పట్నుంచీ ఆయన సాహితీ సమావేశలోలుడై, ఎంతోమందిని సన్మానిస్తూ వచ్చారు.

దశరథరామిరెడ్డి ఒక్కరూ పదిమందికి పెట్టు. నిజానికాయన కోటీశ్వరుడే. కానీ నిరాడంబరంగానే ఉండేవాడు. ఆయనకు ఆర్.బి.సి. విద్యాసంస్థల ట్రస్టీల పట్ల ఎంతో గౌరవంగా వర్తించేవారు. వారందరూ ఆయన్ను అత్యంత గౌరవంగా చూసేవారు. వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తి. ఎవరితోనూ విబేధించిన దాఖలాలు లేవు. అంతిమ శ్వాస విడిచే సమయం వరకూ, ఆయనేదో కార్యక్రమానికి, ఆయన అనుయాయులతో వెడుతూండేవారు. ఒంటరితనం ఒక్కటే ఆయనకు కిట్టనిది. ఆలాటి ఒంటరితనంలోకే ఆయన వెళ్ళిపోయారు. ఆయన ఆత్మకు శాంతి కలుగాలని అందరమూ భగవంతునికి ప్రార్థిద్దాం. నాకేంవిటో దశరథరామిరెడ్డి లేరను మాట జీర్ణం కావడం లేదు. నాకే కాదు ఆయన అభిమానులకూ అంతే అయి ఉంటుంది.